



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States




హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి బేగంపేట విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
–హైదరాబాద్, నవంబర్ 21 (వార్తాప్రభ) :


సంపుటి : 23 | సంచిక : 234 | ది. 22-11-2024 | విజయవాడ | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

- అసెంబ్లీ తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం
- లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాల తరలింపు ఉండదు...కర్నూలులోనే ఉంటాయి
- యువగళం హామీ మేరకు మిషన్ రాయలసీమను సాకారం చేస్తాం
- రాయలసీమ అభివృద్ధికి గత ప్రభుత్వం చీమంత కృషి కూడా చేయలేదు
- మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారు
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- శాసన సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- హైకోర్ట్ బెంచ్ ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం



**అమరావతి,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ ఆమోదించిందని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. హైకోర్ట్ బెంచ్ ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం చంద్రబాబు మాట్లాడారు.

**లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాల తరలింపు ఉండదు..** ‘లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కార్యాలయాల తరలింపు ఉండదు, అవి కర్నూలులోనే ఉంటాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఉత్తరాంధ్రలో విశాఖ, సీమలో కర్నూలు, తిరుపతి పట్టణాలను మరింత అభివృద్ధి చేస్తాం. మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం మూడు ముక్కలాటలాడి ఏ ప్రాంతం అభివృద్ధి కాకుండా చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మేము విశాఖ, కర్నూలులో కూడా అమరావతే రాజధాని అని ఆ ప్రాంత ప్రజలను ఒప్పించాం. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం. గతంలో చేశాం... మళ్లీ చేసి చూపిస్తాం. రాయాల సీమగా ఎడారిగా మారుతుందని ఆలోచించి కృష్ణా జలాలను సీమకు తరలించాలని ఆలోచించింది ఎన్టీఆర్. ఇందులో భాగంగానే తెలుగు గంగ, హంద్రీనీవా, నగరి గాలేరు ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారు. వాటిని పూర్తి చేసేది కూడా ఎన్డీయేనే. నదుల అనుసంధానం చేసి, పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్తే గేమ్ ఛేంజర్ అవుతుంది. కియా పరిశ్రమను తీసుకొచ్చేందుకు యేడాదిలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేశాం. కియా రాకతో అనంత జిల్లా ముఖచిత్రం మారిపోయింది. హార్టికల్చర్ అభివృద్ధి చేస్తే మహర్దశ వస్తుంది. అనంతపురానికి బెంగళూరు ఎయిర్ పోర్టు, కర్నూలుకు హైదరాబాద్ ఎయిర్ పోర్టు, చిత్తూరుకు చెన్నై ఎయిర్ పోర్టులు దగ్గరగా ఉన్నాయి...ఈ మూడు అవకాశాలను అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు. సీమలోనూ మంచి రోడ్లు వచ్చాయంటే టీడీపీ హయాంలోనే. ఓర్వకల్లులో ఎయిర్ పోర్టు పెట్టాం. తిరుపతి ఎయిరో పోర్టును విస్తరించి సర్వీసులు పెంచేలా చేశాం. కడప ఎయిర్ పోర్టులో రాత్రి సమయంలోనూ విమానాలు దిగే అవకాశం కల్పించాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో నాలుగు ఎయిర్ పోర్టులు ఉన్నాయి.

**ఎడ్యుకేషన్ హబ్ గా సీమను మార్చుతాం..** రాయలసీమలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. తిరుపతిని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చుతున్నాం. తిరుపతి ఐఐటీ, ఐజర్, కర్నూలులో ట్రిపుల్ ఐటీ, ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ వర్సీటీ పెట్టి ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చాం. యువగళంలో ప్రకటించిన విధంగా మిషన్ రాయలసీమ హామీలను నెరవేర్చుతాం. హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు 90 శాతం రాయితీతో డ్రిప్ సబ్సీడీ ఇచ్చాం..కానీ గత ప్రభుత్వం దాన్ని కూడా రద్దు చేసింది. మళ్లీ రాయితీతో డ్రిప్ ను రైతులకు అందిస్తాం. గత ప్రభుత్వం రాయలసీమకు చీమంత మేలు కూడా చేయలేదు. తిరుపతి హార్డ్ వేర్ హబ్ గా మారింది టీడీపీ హయాంలోనే. కేంద్రం రెండు ఇండస్ట్రియల్ పార్కులు ఇస్తే వాటిని కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేశాం. వీటి అభివృద్ధికి రూ.5 వేల కోట్లు మంజూరయ్యాయి. ఓర్వకల్లును డ్రోన్ హబ్ గా మార్చేందుకు 300 ఎకరాలు కేటాయించాం. కర్నూలును బెస్ట్ సిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

## ఏపీలో ఎన్టీపీసీ భారీ పెట్టుబడులు

- రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పునరుత్పాదక రంగంలో ప్రాజెక్టులు
- రూ.1,87,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధం
- వచ్చే 25 ఏళ్లలో రాష్ట్రానికి రూ. 20,620 కోట్ల ఆదాయం
- 1 లక్షా 6 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో సత్ఫలితాలు



**అమరావతి, నవంబర్ 21 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగానికి మహర్దశ ప్రారంభమైంది. మహారత్నలో ఒక్కటైన ఎన్టీపీసీ సంస్థ తన ‘ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్’ ఆధ్వర్యాన ఈ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు గురువారం ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) – ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్జీఈఎల్) మధ్య ఒప్పందం జరిగింది.

**రాష్ట్రానికి భారీ లబ్ధి..** ఈ ఒప్పందం అమలులోకి రావడం ద్వారా రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు నెలకొల్పేందుకు రూ. 1, 87,000 కోట్ల పెట్టుబడి ఎన్జీఈఎల్ పెట్టనుంది. దీని ద్వారా దాదాపు రాష్ట్రంలో 1,06,250 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. అలాగే రానున్న 25 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.20,620 కోట్ల లబ్ధి రాష్ట్రానికి వివిధ రూపాల్లో చేకూరనుంది.

**పునరుత్పాదక విద్యుత్ రంగానిదే భవిష్యత్ : ముఖ్యమంత్రి..** ఈ ఒప్పందం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఈ జాయింట్ వెంచర్ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామి చేసే క్రమంలో కీలక అడుగు అన్నారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వంటి పునరుత్పాదక విద్యుత్ రంగ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. భవిష్యత్ అంతా పునరుత్పాదక విద్యుత్ రంగానిదేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ఫస్ట్ ఫేజ్ ను 2027 ఏప్రిల్ మే నాటికి పూర్తి చెయ్యాలని సిఎం తెలిపారు. కాలుష్య రహిత ఇంధన వనరుల ఉత్పత్తికి కృషి చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా వచ్చే ఐదేళ్లలో 78.50 గిగావాట్ల సౌరశక్తి, 35 గిగావాట్ల పవన శక్తి, 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ, 1.50 ఎంఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ లక్ష్యంతో రాష్ట్ర ఇంధన మౌలిక అవసరాలు తీరడమే కాకుండా, రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందన్నారు. పునరుత్పాదక ఇంధన రంగం విషయంలో ఎంతో నిబద్ధతతో, ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, ఈ విషయంలో దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలుపుతామని అన్నారు.

**ప్రాజెక్టుల రాకతో ప్రాంతాల అభివృద్ధి..** ఎన్జీఈఎల్ %-% ఎన్ఆర్ఈడీసీఏపీ సంయుక్త భాగస్వామ్యంతో 25 గిగావాట్ల సామర్థ్యం వున్న సౌర, పవన, హైబ్రిడ్ సిస్టమ్‌ల ఇంధన ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఎన్టీపీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్ వంటి ఉత్పన్నాలను తగిన పద్ధతుల ద్వారా 0.5 మిలియన్ మెట్రిక్ టన్ పర్ యానం ఉత్పత్తి చేయడంపై దృష్టి సారిస్తుంది. అదనంగా, రాష్ట్రంలోని అనువైన ప్రదేశాలలో 10 గిగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. ఈ జాయింట్ వెంచర్‌తో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు రావడమే కాకుండా, ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల రూపురేఖలు మారతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఒప్పందం కార్యక్రమంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎన్టీపీసి గ్రీన్ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ గురుదీప్ సింగ్, ఎన్జీఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్. సారంగపాణి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ట్రాన్స్ కో, జెన్ కో అధికారులు ఉన్నారు

## ఏపీ లో మరోసారి భారీ వర్షాలు

- రెవెన్యూ శాఖ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా
- రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



**అమరావతి,నవంబర్ 21 (వార్తాప్రభ) :** 24 నుంచి అల్పపీడన ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో మోస్తరు నుంచి భారీ వర్షాలు రాష్ట్రంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెవెన్యూ శాఖ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తెలిపారు. రైతులు తక్షణమే వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలు జిల్లాలలో వరి కోతల సీజన్ ప్రారంభం కావడంతో ప్రత్యేకించి వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విపత్కర పరిస్థితులను రైతులు ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుండగా, ఈ ప్రభావంతో ఈనెల 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందన్న అంచనాలు ఉన్నాయని సిసోడియా తెలిపారు. మరో రెండు రోజుల్లో ఈ అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందని, ఫలితంగా ఈనెల 24వ తేదీ నుంచి అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని రెవెన్యూ శాఖ (విపత్తుల నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా వివరించారు.

## తిరిగి మన మూలాల్లోకి వెళ్దాం - లోక్ మంథన్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో వెంకయ్య నాయుడు



**హైదరాబాద్,నవంబర్ 21 (వార్తాప్రభ) :** భారతీయులందరూ తిరిగి తమ మూలాల్లోకి వెళ్లాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. మన భాష,మన వేషధారణ, మన సంస్కృతిని మరిచిపోయామని, తిరిగి ప్రతి ఒక్కరూ మన సంప్రదాయానికి రావాల్సిన అవసరం వుందని నొక్కి చెప్పారు. భారతీయ సనాతన ధర్మం ఎంతో గొప్పదని, మనతో పాటు జంతు జాలాలను కూడా బతికించుకునే సంస్కృతి మనదని కొనియాడారు. భాగ్యనగరం వేదికగా నాలుగు రోజుల పాటు శిల్పారామంలో జరుగుతున్న లోకమంథన్ భాగ్యనగర్ 2024 ఎగ్జిబిషన్ ను వెంకయ్యనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాశ్చాత్యులు భారతీయుల మనస్సులను కూడా దోచుకెళ్లారని, అందుకే ఇప్పుడు మనలో మార్పులు వచ్చాయని, మన సంస్కృతిని, మన భాషను, మన సాహిత్యాన్ని, మన సంగీతాన్ని, మన మాటలను, మన వాయిద్యాలను మరిచిపోయి, ఇంగ్లీషు వైపు వెళ్లిపోయామన్నారు. తిరిగి భారతీయ మూలాలకు వెళ్లి, భారతీయ భాషలను ప్రోత్సహించాలని, ముందుకు మాతృభాష వైపు మళ్లాలని, ఆ తర్వాత ఏ భాష వైపు అయినా మళ్లాలన్నారు. తాము ఏ భాషకీ వ్యతిరేకం కాదని, కానీ.. అసలు భాషైన అమ్మ భాషను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మభాష కళ్లలాంటిదని, ఇంగ్లీషు కళ్లద్దాల్లాంటిదని, కళ్లే లేకపోతే ఎంత మంచి కళ్లద్దాలున్నా దండగేనన్నారు. వలసవాద బుద్ధిని వదిలి, తిరిగి మన మూలాల్లోకి వెళ్లడమే లోకమంథన్ ఉద్దేశమని వివరించారు. చీమకి చక్కెర, పాముకి పాలు పోయడం, చెట్టుకు బొట్టు పెట్టే పవిత్ర సంస్కృతి హిందువులది అని పేర్కొన్నారు. కానీ... ఇప్పుడు పాశ్చాత్యమోహంలో పడిపోయామని, బ్రిటీషులు, విదేశీయులు భారత్ పై దండయాత్ర చేసి దోపిడీ చేశారన్నారు. కేవలం ధనాన్ని దోపిడీ చేయడమే కాకుండా భారతీయ మనస్సులను కూడా మార్చేశారని అన్నారు. అందుకే ఇప్పుడు భారతీయులు మన మూలాలను మరిచిపోయి, పాశ్చాత్యం వైపు మళ్లిపోయామన్నారు. అందుకే తిరిగి భారతీయులందరూ మూలాల్లోకి వెళ్లాలని సూచించారు. భాగ్యనగరం వేదికగా జరుగుతున్న లోకమంథన్ కార్యక్రమానికి హైదరాబాద్ వాసులు, చుట్టుపక్కల జిల్లాల వాసులందరూ తరలివచ్చి, మన మూలాలను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ కూడా మాతృభాషలోనే చదువుకున్నారని, స్వయంగా తాను కూడా ఓ వీధి బడిలో చదువుకున్నానని వెంకయ్య నాయుడు తెలిపారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ తన చదువుకునే సమయంలో కాన్వెంట్ మొహమే చూడలేదని, అయినా గొప్ప వ్యక్తి అయ్యారన్నారు. తాను ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించినా సరే... తన వేషధారణలో మార్పు చేయలేదని ప్రకటించారు. అందుకే మన మాతృభాషను, మన సంస్కృతిని ఆచరించడంలో, హిందువునని ప్రకటించడంలో, మన మన ప్రాంతం చెప్పే సమయంలో సిగ్గు పడొద్దని, అత్యంత గర్వంగా ప్రకటించుకోవాలని సూచించారు. మనకు పురాతనంగా వస్తున్న సంప్రదాయాలను ఆచరించాలని అన్నారు. మాతృభాషను అందరూ మాట్లాడాలన్నారు. ఇంగ్లీషు వ్యామోహం అస్సలే పనికిరాదన్నారు. మనకు పురాతనం నుంచి వస్తున్న సంగీత సాధనాలకు, సాహిత్యానికి అందరూ గౌరవించాలని, ఆదరించాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. విదేశాల్లో వున్న తెలుగు వారు తెలుగును బాగా ఆదరిస్తున్నారని కానీ...మనం మాత్రం ఇక్కడ ఇంగ్లీష్ మోజులో పడ్డామన్నారు. ఈ పంచభూతాల్లో దైవత్వాన్ని చూసే సంప్రదాయం హిందువులదని, అలాగే బ్రహ్మచర్యం, గృహస్థు, వానప్రస్థం, సన్యాసాశ్రమంఅన్న చతురాశ్రమ ధర్మాలను కూడా హిందూ ధర్మం బోధించిందన్నారు. ప్రకృతితో అందరూ స్నేహపూర్వకంగా వుండాలని, సంస్కృతిని కూడా ఆచరిస్తూ పోతే... అందరి జీవితాలు బాగుంటాయన్నారు. చిన్నతనం నుంచే పిల్లలను కష్టపడే తత్వం నేర్పించాలని, శారీరిక శ్రమ చేయాలన్నారు. యోగ ద్వారా యోగ్యులవుతారని అన్నారు. యువకులందరూ శారీరకంగా బలిష్ఠంగా వుంటేనే మానసికంగా దృఢంగా వుంటారన్నారు. హిందూ సంప్రదాయానికి కుటుంబ వ్యవస్థ కీలకమని వెంకయ్యనాయుడు అన్నారు. కుటుంబ వ్యవస్థను పటిష్ఠంగా వుంచుకోవాలన్నారు. కుటుంబంలో వుండే పెద్దవారితో సమయం గడపాలని సూచించారు. కుటుంబ వ్యవస్థ భారతీయతకే ప్రత్యేకత అని, అప్పుడే ప్రపంచానికి ఆదర్శంగా వుంటామని వెంకయ్య నాయుడు అన్నారు.

## పెన్షన్ దారులకు వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- రెండు నెలపాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయిన మూడో నెలలో ఒకేసారి మొత్తం చెల్లింపు.
- పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణించిన క్రమంలో భార్యకు మరుసటి నెలలో వితంతు పెన్షన్ మంజూరు.
- అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**అమరావతి,నవంబర్ 21 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పెన్షన్ దారులకు పెన్షన్ల పంపిణీని సరళతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకుందని, రెండు నెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయినా మూడో నెలలో ఆ మొత్తాన్ని చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి నెలలో పెన్షన్ తీసుకోకపోయినా రెండో నెలలో రెండు నెలల పెన్షన్ మొత్తాన్ని కలిపి ఇస్తారని, ఒకవేళ రెండు నెలపాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే ఆ రెండు నెలల మొత్తాన్ని కలిపి మూడో నెలలో మూడు నెలల పెన్షన్ మొత్తం ఒకేసారి అందజేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. వరుసగా మూడు నెలల పాటు పెన్షన్ తీసుకోకపోతే వారిని శాశ్వత వలసదారులుగా గుర్తించి ఆ పెన్షన్ ఆపివేయడం జరుగుతుందని, వారు తిరిగి యధా స్థానానికి వచ్చిన తర్వాత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి తిరిగి పెన్షన్ పునరుద్ధరించడం జరుగుతుందని అన్నారు. వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని అకస్మాత్తుగా మరణించిన పక్షంలో అతని భార్యకు మరుసటి నెలలోనే వితంతు పెన్షన్ మంజూరు చేయటం జరుగుతుందని మంత్రి తెలియజేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం సంబంధిత అధికార యంత్రాంగానికి ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. జిల్లాస్థాయిలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, క్షేత్రస్థాయిలో సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇచ్చినట్టు మంత్రి శ్రీనివాస్ ఈ ప్రకటనలో వివరించారు. ఈ ప్రకటన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కార్యాలయం అమరావతి నుంచి విడుదల చేయడమైనది

## మంత్రి సవితకు సీపీఐ రామకృష్ణ అభినందనలు



**అమరావతి,నవంబర్ 21 (వార్తాప్రభ) :** చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అభినందించారు. ఈ మేరకు గురువారం అమరావతిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో నాలుగో బ్లాక్ లో ఉన్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి సవితకు అభినందనలు తెలిపారు. సాహసోపేతమైన నిర్ణయమని, బీసీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని రామకృష్ణ కొనియాడారు.

## గౌతమ్ అదానీపై అమెరికాలోని న్యూయార్క్ జిల్లా కోర్టులో కేసు

- ఐదు రాష్ట్రాల్లో ప్రభుత్వాధికారులకు 2029 కోట్ల రూపాయలు లంచాలు
- ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకున్న పవర్ సేల్ అగ్రిమెంట్‌తో ఈ లంచాలకు అంకురార్పణ
- ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూపు అమెరికా బ్యాంకులు, పెట్టుబడి దారుల నుంచి బిలియన్ డాలర్లను సమీకరణ



**న్యూఢిల్లీ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలోని న్యూయార్క్ జిల్లా కోర్టులో నమోదైన లంచాల కేసులో జగన్ సర్కార్ పాత్ర వెలుగుచూసింది. సోలార్ విద్యుత్ ఒప్పందాల కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ఐదు రాష్ట్రాల్లో ప్రభుత్వాధికారులకు 2029 కోట్ల రూపాయలు లంచాలు ఇవ్వాలని అదానీ నిర్ణయించిందని అమెరికా ప్రాసిక్యూటర్ కేసుపత్రాల్లో పేర్కొన్నారు. 2029 కోట్లలో ఆనాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ పెద్ద జగన్‌కే రూ.1750 కోట్లు చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని వెల్లడించింది. జగన్‌ను విదేశీ అధికారిగా అమెరికన్ ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఐదేళ్లు పాలించి అనేక కుంభకోణాలకు తెరతీసిన వైఎస్సార్సీపీ సర్కార్ హయాంలో మరో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అది కూడా అమెరికాలోని న్యూయార్క్‌లో కేసు నమోదైంది. సోలార్ విద్యుత్ సరఫరా కాంట్రాక్టుల కోసం గౌతమ్ అదానీ లంచాలు ఇచ్చారని న్యూయార్క్ జిల్లా కోర్టులో నమోదైన కేసులో పత్రాలను పరిశీలిస్తే జగన్ సర్కార్ ఎంతకు తెగించిందో స్పష్టంగా తెలుస్తోంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో 7 గిగావాట్ల సౌర విద్యుత్ కొనేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకున్న పవర్ సేల్ అగ్రిమెంట్‌తో ఈ లంచాలకు అంకురార్పణ జరిగింది. 2021 జులై నుంచి 2022 ఫిబ్రవరి మధ్య సోలార్ విద్యుత్ కొనుగోలు చేసేందుకు సెకీతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందాల్లో ఒక్క ఆంధ్రప్రదేశ్ డిస్కంలు 7 వేల మెగావాట్లను సరఫరా చేసేందుకు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2025 జనవరి నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని సెకీ చెప్పింది. అయితే అదానీ పవర్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌ను ఏపీకి సరఫరా చేయాలని సెకీ నిర్ణయించింది. 2021 అక్టోబరు 14న నాటి సీఎం జగన్ నివాసానికి వచ్చిన గౌతమ్ అదానీ చర్చలు జరిపిన తర్వాతే డిస్కంలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై నాటి ఇంధనశాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్, డిస్కమ్‌ల తరపున సీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్ధన్ రెడ్డి, ఇతర అధికారులు సంతకాలు చేశారు. 2.3 గిగావాట్ల విద్యుత్ కొనుగోలుకు 25 ఏళ్ల పాటు యూనిట్‌కు 2.49 రూపాయల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. అయితే అదే సమయంలో గుజరాత్ రాష్ట్రానికి యూనిట్‌ను రూపాయి 99పైసలకే సెకీ ద్వారా అదానీ గ్రీన్ ఎనర్జీ విక్రయించింది. అయితే ఇవన్నీ తెరముందు జరిగిన అధికారిక ఒప్పందాలు. ఒప్పందాలు కుదరడానికి తెరవెనక పెద్ద భాగోతమే జరిగిందని అమెరికా కోర్టులో నమోదైన కేసు పత్రాల్లో తెలుస్తోంది. అధిక ధరల కారణంగా సెకీ నుంచి విద్యుత్ కొనుగోలుకు ఏ ప్రభుత్వ సంస్థా ముందుకు రాకపోవడంతో అదానీ గ్రూపు ప్రతినిధులు లంచాలు ఎరవేసినట్లు అమెరికన్ ప్రాసిక్యూటర్ తెలిపారు. ఇండియన్ ఎనర్జీ కంపెనీ అంటే అదానీ గ్రీన్‌ఎనర్జీ కంపెనీ, దానికి అనుబంధంగా ఉన్న మారిషస్‌కు చెందిన పునరుత్పాదక సంస్థ అమెరికా ఇష్యూయర్ ప్రతినిధులు ఈ అవినీతికి తెరలేపినట్లు వెల్లడించారు. గౌతమ్ అదానీ, అదానీ మేనల్లుడు సాగర్ అదానీ, అదానీ బోర్డు సభ్యుడు వినీత్ జైన్, ఇతరులు అప్పటి ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇవ్వడం ద్వారా ఒప్పందాలకు మార్గం సుగమం చేశారని అమెరికన్ ప్రాసిక్యూటర్ తెలిపారు. భారత ప్రభుత్వ అధికారులకు దాదాపు 2029 కోట్ల లంచాలు ఇవ్వాలని నిర్ణయించారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు కాంట్రాక్టు లెక్చరర్స్ నాయకులు సత్కారం



రాజమహేంద్రవరం,నవంబర్ 21 (వార్తాప్రభ) : విద్యార్థుల బంగారు భవిష్యత్ కు బాటలు వేసి,వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్న దవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ చరిత్ర అధ్యాపకులు కొండ్ర రమేష్ బాబు ని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గొర్ల మాణిక్యం, కామా శేషగిరి,వై.జాన్ బాబు తదితరులు శాలువా కప్పి,పూల బొకె తో ఘనంగా సత్కరించారు. అనంతరం కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గొర్ల మాణిక్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులదే ఘననీయమైన పాత్ర అని అటువంటి వృత్తిని చిత్తశుద్ధితో నిర్వహించే రమేష్ బాబు వంటి అధ్యాపకుల్ని ఉపాధ్యాయ వృత్తిలో పని చేసే మనందరం ఆదర్శంగా తీసుకుని పనిచేసేనప్పుడే దేశ భవిష్యత్ బాగుంటుందన్నారు. రమేష్ బాబు భవిష్యత్ లో మరిన్ని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వి.ఎస్.శేఖర్ బాబు, వెంకటరమణ,రత్నం, రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# గోపీమూర్తిని గెలుపుకోసం కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘ నాయకులు విస్తృత ప్రచారం



జగ్గంపేట,నవంబర్ 21 (వార్తాప్రభ) : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గొర్ల మాణిక్యం,కె.శేషగిరి, వై.జాన్ బాబు, జి.ప్రశాంతి తదితర రాష్ట్ర నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక జగ్గంపేట ప్రభుత్వ జూనియర్,ఐటిఐ కాలేజీ అధ్యాపకుల్ని కలిసి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాణిక్యం మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నీతికీ,నిజాయితీకీ మారుపేరని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి గోపీమూర్తిని గెలిపించుకోవలసిన ఆవశ్యకత ఉపాధ్యాయుల పై ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అమర్ కళ్యాణ్, రామకృష్ణ, మూర్తి, రాము, శ్రీనివాసరావు, రాంబాబు,యేసురాణి,శివ రామకృష్ణ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సేవాతత్పరురాలు, చరిత్ర అధ్యాపకురాలు పామర్తి లీలా వతి కి డాక్టరేట్ ప్రకటన



విజయవాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో డాక్టరేట్ ప్రధాన కార్యక్రమం నేడు ఘనంగా జరిగింది. విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు పామర్తి లీలావతి పీ. హెచ్ డీ థీసిస్ ను హిస్టరీ మరియు ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ కు జూన్ 26, 2024 లో సబ్మిట్ చేయడం జరిగింది. విదేశీ యూనివర్సిటీ, ఇతర రాష్ట్రాలలో పరిశీలనా నంతరం ఆమోదం పొందింది. అనంతరం మౌఖిక పరిశీలన (వైవా) బుధవారం జరిగింది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ భాస్కర్ రెడ్డి ముఖ్య మౌఖిక అధికారిగా వ్యవహరించారు. నాగార్జున యూనివర్సిటీ చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ యస్. మురళీ మోహన్, ప్రొఫెసర్ పద్మావతి పరిశీలనలో 'ఆంధ్రప్రదేశ్ లో కలంకారీ కళ:: కృష్ణా జిల్లా లో ప్రధాన పరిశీలన' అంశం పై లీలావతి ప్రసంగించారు. అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర ప్రసాద్, రమీ బేగం, స్కాలర్లు ప్రశ్నార్థులుగా అనేక ప్రశ్నలు సంధించి అంశం గురించి చర్చించారు. దాదాపు గంట సేపు సాగిన ఈ థీసిస్ వైవా అనంతరం డాక్టర్ పట్టా ను భాస్కర్ రెడ్డి గచేశ గైడ్ ప్రొఫెసర్ ప్రకటించారు. జి. సోమశేఖర్ తన విద్యర్ధి లీలావతి కలంకారీ అంశం పై కూలంకుషంగా చేసిన కృషి ని గురించి తెలియచేసి అభినందించారు. అవార్డు ను అందుకుని కృతజ్ఞతలు, సంతోషాన్ని వ్యక్తం చేసి ఐదు సంవత్సరాలుగా తాను చేసిన కృషి ఫలించి తనకు డాక్టరేట్ ఇచ్చిన, పాల్గొన్న ప్రతి ఒక్కరికి లీలావతి కృతజ్ఞతలు తెలియచేశారు. అనంతరం తన పరిశీలనా గ్రంధాన్ని గైడ్ సోమశేఖర్ కు, హెడ్ మురళిమోహన్ కు అందచేసి ఆశీస్సులు తీసుకున్నారు. సమావేశం లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పీజీ విద్యార్థులు, స్కాలర్ లు 80 మంది హాజరై అభినందనలు తెలిపారు.

# టీడీపీకి పునాది కార్యకర్తలు సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

● రాష్ట్ర మహిళ నేత గంగిరెడ్ల మేఘాలదేవి



కొయ్యలగూడెం,నవంబర్ 21 (వార్తాప్రభ) : తెలుగుదేశం పార్టీకీ పునాది కార్యకర్తలు అని, ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని, టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గంగిరెడ్ల మేఘాలదేవి అన్నారు గురువారం ఆమె టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా మేఘాలదేవి మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు లోని 7 నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో సభ్యత్వం నమోదు చేయించి రికార్డ్ సృష్టిదామన్నారు ,విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు , దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం 9 నెలల్లోనే టీడీపీని ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి తెచ్చారని కొనియాడారు. విజనరీ నేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంను సమానంగా రాష్ట్రంలో ముందుకు తీసుకెళ్లుతున్నారన్నారు, అదేవిధంగా టీడీపీ సీనియర్ మహిళ నాయకులు కొత్త రమ మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు గుర్తింపు, భరోసా ఉంటాయన్నారు , టీడీపీ సభ్యత్వం ఉన్న వారికి పార్టీ రూ.5 లక్షల ప్రమాదబీమాతోపాటు ఆ కుటుంబానికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. కనుక ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందాలని సూచించారు. అనంతరం పలువురి చేత సభ్యత్వ నమోదు చేయించారు.

# బత్తులవారిగూడెం నగర వనంలో ఆహ్లాదకరంగా గడిపిన త్రివిధ స్కూల్ విద్యార్థులు





నూజివీడు,నవంబర్ 21 (వార్తాప్రభ) : నూజివీడు త్రివిధ స్కూల్ విద్యార్థులు వన సమారాధనలో భాగంగా ఆహ్లాదకరంగా గడిపారు. నూజివీడు మండలం, బత్తులవారిగూడెం గ్రామంలోని నగరవనంలో కార్తీక మాసం సందర్భంగా త్రివిధ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. గురువారం ఉదయం నుండి ఆటపాటలతో ఆహ్లాదకరంగా నగరవరంలో విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు చిన్ననాటి స్మృతులను విజ్ఞప్తికి తెచ్చుకున్నారు. కార్తీక మాసం, తెలుగు పండుగలు, వాటి విశిష్టతను, మన సంస్కృతి, సాంప్రదాయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటవిడుపుగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయటానికి అవకాశం ఉంటుందని త్రివిధ పాఠశాల అధినేత శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో త్రివిధ పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందంతోపాటు ఎల్ కేజీ నుండి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# 'యమజాలీ..లవ్ మీ లైలా' సక్సెస్ మూవీ అవుతుంది

● నిర్మాత కె.మహేశ్వర, డైరెక్టర్ సాయిపవన్ సుంకర







మైలవరం,నవంబర్ 21 (వార్తాప్రభ) : ఎస్పి క్రియేషన్స్ పతాకంపై కె.మహేశ్వర నిర్మాత, డైరెక్టర్ సాయిపవన్ సుంకర తెరకెక్కించబోయే కొత్త సినిమా 'యమజాలీ..లవ్ మీ లైలా' రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాల యంలో టైటిల్‌ను ప్రొడ్యూసర్ కె.మహేశ్వర, డైరెక్టర్ సాయి సుంకర, సినీ నటులు వీరంకి వెంకట నరసింహా రావు ఆవిష్కరించారు. అనంతరం మహేశ్వర, సాయిపవన్ సుంకర మాట్లాడుతూ పూర్తిగా గ్రామీణ వాతావరణంలో జాలీ లవ్, ఫన్ ఎలిమెంట్లతో ఈ సినిమాను తెరకెక్కిస్తా మన్నారు. అంతా కొత్తనటులతో సరికొత్త గా ఈ సినిమాను తెరకెక్కించి సూపర్ డూపర్ హిట్ కొట్టాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యిందన్నా రు. తారాగణం ఎంపికలు జరుగుతున్నా యన్నారు. గతంలో 'యమ' పేరుతో వచ్చిన యమదొంగ, యమగోల, యమలీల, యముడు, యముడికి మొగుడు తదితర సినిమాలు బ్లాక్ బ్లస్టర్ హిట్‌గా నిలిచాయని గుర్తుచేశా రు. అదే కోవలో 'యమజాలీ..లవ్ మీ లైలా'ను ప్రేక్షకులు బ్లాక్‌బ్లాస్టర్ హిట్‌గా చేయాలని కోరారు. సరికొత్త కథతో సినిమా ఆద్యంతం సస్పెన్స్‌తో కూడిన ఎమోషన్స్, కామెడీ ఉంటుందన్నారు. రొటీన్ కథలకు భిన్నంగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నామన్నారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తికాగానే పోస్ట్‌ప్రొడక్షన్స్ పనులు చేపడతామన్నారు. అనంతరం రెగ్యులర్ షూటింగ్‌ను నిర్వహిస్తామన్నా రు. తొలుత విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో కె.మహేశ్వర, సాయిపవన్ సుంకర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా విజయవాడ వచ్చిన జబర్దస్త్ రాకేష్– సుజాత దంపతులను కలిసి అభినందిం చారు. దాసరి నారాయణరావు శిష్యుడి గా రెండు దశాబ్దాల పాటుగా దర్శకరత్న దాసరి నారాయణరావు శిష్యుడిగా పనిచేసిన అపార అనుభవంతో 'యమజాలీ..లవ్ మీ లైలా'ను తెరకెక్కిస్తున్నామని డైనమిక్ రైటర్, సినిమా దర్శకుడు సాయిపవన్ సుంకర వివరించారు. మూసపద్ధతిలో వచ్చే సినిమాలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. ప్రేక్షకుల ఆలోచనలు, మారుతున్న సమాజ పరిస్థితులు అద్దంపట్టేలా ఈ సినిమాలో పాత్రలు ఉంటాయన్నారు.

**సరికొత్తగా...ప్రేక్షకులు మెచ్చేలా:** అన్ని తరగతుల ప్రేక్షకులు మెచ్చేలా 'యమజాలీ..లవ్ మీ లైలా'ను తెరకెక్కి స్తామని నిర్మాత కె.మహేశ్వర అన్నారు. త్వరలో ఆడిషన్స్ ఏర్పాటుచేస్తామన్నా రు. నటీనటుల ఎంపిక తర్వాత సినిమా రెగ్యులర్ షూటింగ్ కొనసాగిస్తామన్నారు క్లాస్, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో పాటుగా కమర్షియల్ ఎలిమెంట్లతో పూర్తిగా జాలీలైఫ్‌లా,అందరూ మెచ్చేలా సినిమాను తెరకెక్కిస్తామన్నారు.

**హిట్‌మూవీగా నిలుస్తుంది...** సినిమాలకు అనేక రకాలుగా పేర్లు వస్తుంటాయి...కొన్ని మామూలుగానూ, మరికొన్ని భిన్నంగానూ, ఇంకొన్ని ఆలోచించేవిగా ఉంటాయని ప్రముఖ సినీనటులు వీరంకి వెంకట నరసింహారావు అన్నారు. 'యమజాలీ..లవ్ మీ లైలా' సినిమా టైటిల్ సరికొత్త దనాన్ని చెబుతోందన్నారు. దర్శకుడు సాయిపవన్ సుంకర, నిర్మాత కె.మహేశ్వర చెప్పిన కథనం వింటుంటే టైటిల్‌తోపాటుగా కథ కూడా రొటీన్‌కు భిన్నంగా ఉందన్నారు. మాస్, క్లాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని తీయనున్న 'యమజాలీ..లవ్ మీ లైలా' సూపర్ డూపర్ హిట్ మూవీగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదని వివరించారు.

# జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు





నూజివీడు,నవంబర్ 21 (వార్తాప్రభ) : శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారము జాతీయ రాజ్యాంగ దినోత్సము సంధర్భంగా ఈ రోజు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడమైనది. పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు పి.రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాను సారము ఈ కార్యక్రమం లో భాగంగా భారత రాజ్యాంగము గురించి కమిటీ మరియు సభ్యులు గూర్చి వివరించడం జరిగినది. భారత రాజ్యాంగమురచించడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టినది అని తెలిపారు. భారత రాజ్యాంగం 395 ప్రకరణములు 9 షెడ్యూల్స్ తో రూపొందించడం జరిగినది అని తెలియచేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో భాగంగా వ్యాసరచనలో ప్రథమ బహుమతి బూరుగు హాసిని, ద్వితీయ బహుమతి పల్లెపాము నాగాంజలి , తృతీయ బహుమతి ధనలక్ష్మి వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి కందుల ఉమాశ్రీ, ద్వితీయ బహుమతి వేముల దివ్వరాణి , తృతీయ బహుమతి నందేటి రుచిత, క్విజ్ లో దివ్యరాణి, సాయి హర్ష ,హాసిని, ఉమశ్రీ, నాగజ్యోత్స్న విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ భావిశెట్టి వీరయ్య మరియు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు జల్లు లక్ష్మి, మల్లేశ్వరి, విఠల్ బాబు, మోహన్ రావు, బాలు, సాకారవి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ ,సౌజన్య, మనోహరం, విజయలక్ష్మి, రాధిక నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, రంగారావు,నారాయణ పాల్గొన్నారు. ఈ బహుమతులన్నీ స్టాఫ్ సెక్రటరీ బాలు అందించటం జరిగినది.

# ఆధునికతను అంది పుచ్చుకోవాలి



కొయ్యలగూడెం,నవంబర్ 21 (వార్తాప్రభ) : ఆటో రంగంతో ముడిపడి ఉన్న వర్గాల వారు ఆధునికతను అందిపుచ్చుకొని వృత్తిలో రాణించాలి అని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి, పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ఛార్జి మండవల్లి సోంబాబు పేర్కొన్నారు. నరసన్నపాలెం వై జంక్షన్ ఫ్రెండ్స్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద హెచ్పిసిఎల్ సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్టర్స్ రంగానికి చెందిన వర్గాల వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అవగాహన సమావేశంలో తెలుసుకున్న అంశాల వలన ఆయిల్ లో కల్పిస్తున్న రాయితీ, ఆటో రంగాలకు చెందిన వారికి ఇన్సూరెన్స్ అమలు, ప్రయాణ సమయంలో ఉచిత మెకానిజం, వైద్య,ఆరోగ్య అమలు, ప్రమాద సమయాలలో ఉచిత అడ్వకేట్ సహాయం గురించి ఆటో, ట్రాన్స్పోర్ట్ రంగాల వారు లబ్ధి పొందవచ్చు అన్నారు. ఆయిల్ ఫిల్లింగ్ చేసే సమయంలో బంకులలోని సిబ్బంది డ్రైవర్లు, క్లీనర్లతో చెయ్యి కలపకుండా ఖచ్చితమైన ఆయిల్ రీడింగ్ అమలు చేయడానికి (ఐటీఎస్పి) ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ సొల్యూషన్ పేమెంట్ విధానం అమలులోకి తీసుకువచ్చామని తద్వారా ట్రాన్స్పోర్టర్స్ యజమానులు మోసపోకుండా ఉంటారని హెచ్పీసీఎల్ డీజీఎం బివిఎల్ నరసింహారావు పేర్కొన్నారు. అనంతరం రాజమండ్రి జీఎస్ఎల్ హాస్పటల్ ఆధ్వర్యంలో కంటి,పంటి ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని యూనియన్ నాయకులతో కలిసి ప్రారంభించారు. శిబిరంలో గుర్తించిన రోగులకు హెచ్పీసీఎల్ ద్వారా ఉచితంగా ఔషధాలు,కళ్ళజోళ్ళు పంపిణీ చేసారు. హెచ్పిసిఎల్ అధికారులు కేజీ గోకుల్ కన్నన్, వై శ్రీనివాస్, కె క్రాంతికుమార్, నిమ్ము శరత్, కొయ్యలగూడెం జంగారెడ్డిగూడెం ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులు, ఆటోనగర్ మెకానిక్ లు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి..



కోడూరు,నవంబర్ 21 (వార్తాప్రభ) : గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని కోడూరు మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అన్నారు. గురువారం కోడూరు శివారు దింటిమేరక గ్రామంలో ?9.90 లక్షల ఎన్.ఆర్.జి.ఎస్ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, తిరుమల శెట్టి సునీత గుమ్మడి సాంబశివరావు, లంకె రవి, పోనమాల వెంకటేశ్వరరావు, వెన్నా గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థ పటిష్టతకు శ్రీకారం

● గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు



విస్సన్నపేట,నవంబర్ 21 (వార్తాప్రభ) : స్థానిక మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరించే లక్ష్యంగా 200 సిమెంటు తూర్లను గ్రామంలో వార్డు వార్డున ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లే శ్వరి కోటేశ్వరరావు మీడియాకు తెలియజేశారు. గత వారం రోజులుగా ఆరవ వార్డు నుండి పదవ వార్డు వరకు తూరలు వేయిస్తున్నట్లు చెప్పారు. కులమత రాజకీయాలకు అతీతంగా అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించే లక్ష్యంగా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడం జరుగుతుందని సంపద సృష్టి కార్యక్రమంలో భాగంగా గడపగడపకు వాహనాన్ని పంపి తడి చెత్తను పొడి చెత్తను స్వీకరిస్తున్నామని ఆమె తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఏకే రావు, టిడిపి యువ నేత ఏ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన పెడన క్రీడాకారులు



పెడన,నవంబర్ 21 (వార్తాప్రభ) : డిసెంబర్ 8 నుంచి11 తారీకు వరకు హైదరాబాద్ లోని తెలుగు లలిత భవన్లో సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు పోటీలు జరగనున్నాయి ఈ నేపథ్యంలో ఈనెల జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పథకాలు సాధించిన పెడన క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సెక్రెటరీ డి దినేష్ బాబు ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 66 కేజీల సబ్ జూనియర్ కేటగిరిలో హర్షిత్ సాయి 66 కేజీల సీనియర్ విభాగం పి కార్తీక్ నాగదుర్గ 74 కేజీల సీనియర్ విభాగంలో వి తరుణ్ సాయి మౌళి 83 కిలోల సీనియర్ విభాగంలో ఎన్ శివకుమార్ 83 కిలోల మాస్టర్ 3 విభాగంలో వి భీమేశ్వరరావు 120 కిలోల సీనియర్ విభాగంలో వి గణేష్ లు ఎన్నికయ్యారు. ఈ పోటీలలో పాల్గొని క్రీడాకారులకు ట్రైనర్ పుచ్చల వీర కోట సుబ్రమణ్యం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

# కార్తీకమాసం వేళ గోకర్ణేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల ప్రత్యేక పూజలు

● కార్తీక మాసం సందర్భంగా కార్తీక వన సమారాధన నిర్వహణ

● గోకర్ణేశ్వర స్వామి సన్నిధిలో జనసేన టిడిపి నేతలు



కోడూరు,నవంబర్ 21 (వార్తాప్రభ) : కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోకర్ణేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసం సందర్భంగా కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని దేవస్థాన ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. వేలాదిగా భక్తులు, పాల్గొని స్వామివారి అన్న సమారాధన స్వీకరించారు. స్వామివారిని మండల జనసేన, తెలుగుదేశం పార్టీ నేతలు దర్శించుకున్నారు. లింగారెడ్డి పాలెం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి శ్రీ దుర్గా, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, పార్టీ నేతలు కోట సుబ్బారావు , యర్రంశెట్టి దామోదర్ రావు,పూత బోయన సీతారత్న సాయిబాబు, దాసరి వెంకటకృష్ణారావు, టిడిపిమాజీ జడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు , పంచాయితీ మాజీ సర్పంచ్ కడవకొల్లు నాంచారయ్య, శ్రీ గోకనేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కడవకొల్లు శ్రీనివాసరావు, బడే వీరబాబు,కాగిత రామారావు, యలవర్తి వెంకటేశ్వరరావు, గోగినేని సోమ శేఖర్, వేములపల్లి రాజేష్, మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు తదితరులు ఉన్నారు.

# సిపిఎం మండల పార్టీ కన్వీనర్ గా చాకిరి



ఆగిరిపల్లి, నవంబర్ 21 (వార్తాప్రభ) : ఆగిరిపల్లి మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గా చాకిరి శివ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఆగిరిపల్లి లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ గా చాకిరి నాగరాజును ఎన్నుకున్నారు. సమావేశంలో నూతన కమిటీ సభ్యులనూ ఎన్నుకున్నారు. నూతన మండల కమిటీ సభ్యులు గా ముత్యాల నరేష్ ,ఈపూరి రవీంద్ర , ఎన్. ఉలక్కయ్య,జంగం చౌరి , ఎం శుభకర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అద్వానంగా ఉన్న రోడ్డుకు మరమత్తులు చేస్తున్న అధికారులు



వీరులపాడు,నవంబర్ 21 (వార్తాప్రభ) : వీరులపాడు ు అల్లూరు మధ్యలో చట్టన్నరం కల్వర్ట్ వద్ద రహదారి అధ్వానంగా మారటంతో అధికారులు గురువారం ఈ రోడ్డుని మరమ్మత్తులు చేయడం ప్రారంభించారు. ప్రయాణించే వాహనాలు దారులు ఇటీవల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం కేవలం పరమత్తులకే పరిమితం కాకుండా పూర్తి స్థాయిలో రహదారి నిర్మించాలని స్థానిక ప్రజలు కోరారు. అదేవిధంగా అల్లూరు నుంచి వీరుల పాడు వంకు మరమత్తులు పనులు అధికారులు చేపట్టారు.

# టాప్ 20 విజేత సూర్య కుమార్



పోడూరు,నవంబర్ 21 (వార్తాప్రభ) : పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం, చింతలగరువు మం.ప.ప్రా.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సాహితీవేత్త కొల్లాబత్తుల సూర్య కుమార్ శ్రీశ్రీ కళావేదిక ప్రశంసలు అందుకున్నారు. కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక 'బాల్యం' అనే అంశంపై కవితల పోటీ నిర్వహించగా అందులో 500 మందికి పైగా కవులు పాల్గొన్నారు. ఆపోటీలో నాల్గవ గ్రూప్ లో సూర్య కుమార్ 'ఏ బాల్యం కావాలి?' అనే కవితతో తన ప్రతిభను చూపి, టాప్ 20లో విజేతగా నిలిచారు. ఆయనను శ్రీశ్రీ కళావేదిక అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కో ఆర్డినేటర్ నూక సంపత్, కవులు కోలాటి పెద్దిరాజు, చేగొండి రంగారావు, స్టైల్ కింగ్ రాజా, డా.వి.వి.వి యస్ సుబ్బా రావు, గోలి శిరీష, పొపోప్పు విజయలక్ష్మి తదితరులు ఆయనను అభినందించారు.

# ఎడిటోరియల్

## కెనడా మరో చీప్ ట్రిక్... హాస్యాస్పదం అంటున్న భారత్!

అవకాశం వచ్చినప్పుడల్లా భారత్ పై బురదజల్లేందుకు తెగ ఉత్సాహం చూపిస్తున్న కెనడా.. మరోసారి తప్పుడు ప్రయత్నం చేసింది! ఈ మేరకు కెనడా మీడియాలో ఓ సంచలన కథనం ప్రచురితమైంది. ఇందులో నేరుగా భారత ప్రధాని నరేంద్ర మోడీ పేరు ప్రస్తావించి మరీ కవ్వింపు చర్యలకు పాల్పడింది. దీనిపై భారత్ గట్టిగా తగులుకుంది.అవును... గత కొంతకాలంగా భారత్ – కెనడాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత పతన స్థితికి చేరుకున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా.. ఖలీస్థానీ ఉగ్రవాది హర్ దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటన నేపథ్యంలో... కెనడా ప్రధాని జాస్టిన్ ట్రూడో.. భారత్ పై విరుచుకుపడుతున్నారు.దీనిపై స్పందించిన భారత్... కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోణంలోనే ఆలోచిస్తూ, భారత్ పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ కెనడా ప్రధానిపై నిప్పులు చెరుగుతుంది. ఈ సమయంలో.. కెనడాకు చెందిన “ది గ్లోబ్ అండ్ మెయిల్” వార్తాపత్రికలో ఇటీవల నిజ్జర్ హత్య గురించి ఓ కథనం ప్రచురితమైంది.ఈ కథనంలో... నిజ్జర్ హత్యకు కుట్రలో భారత జాతీయ భద్రతా సలహాదారు, విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా భాగమైనట్లు తమకు తెలిసిందని.. కెనడా సీనియర్ జాతీయ భద్రతా అధికారి ఒకరు చెప్పారని పేర్కొంది. ఇదే సమయంలో... భారత ప్రధాని నరేంద్ర మోడీ పేరును కూడా ఈ కథనంలో ప్రస్థావించింది.దీనిపై స్పందించిన భారత్... తాము సాధారణంగా మీడియా కథనాలపై స్పందించబోమని.. కానీ, కెనడా ప్రభుత్వ వర్గాలను ఉద్దేశించి వెలువడిన ఈ హాస్యాస్పద వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఇలాంటి దుష్ప్రచారాలు ఇప్పటికే దెబ్బతిన్న ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజారుస్తాయని కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ప్రకటన విడుదల చేశారు.కాగా... గత కొంతకాలంగా భారత్ పై కెనడా పలుమార్లు చిల్లర ఆరోపణలు చేస్తున్న పనులకు పాల్పడుతూనే ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. కెనడాలోని ఖలిస్థానీ సానుభూతిపరులపై దాడుల వెనుక భారత పాత్ర ఉందంటూ ఆ దేశ ఆర్థిక మంత్రి ఒకరు.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై అసంబద్ధ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

## బాలోత్సవంలో నూజివీడు త్రివిధ స్కూల్ విద్యార్థుల ప్రతిభ




**నూజివీడు: నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించిన బాలోత్సవంలో నూజివీడు త్రివిధ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి పలు అంశాల్లో బహుమతులు పొందినట్లు త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో పదవ తరగతికి చెందిన జి.రోహిత ప్రథమ స్థానం, కె.నిఖిలశ్రీ రెండవ స్థానం, కార్టూన్, డ్రాయింగ్ లో ఫిరిడోస్ మొదటిస్థానం, వ్యాసరచనలో కె.జాహ్నవి రెండవ బహుమతి, కె.హరిప్రియ ప్రోత్సాహక బహుమతి పొందినట్లు తెలిపారు. వ్యాసరచన సీనియర్స్ విభాగంలో ఎస్.ప్రణయ్ కార్తీక్ రెండవ బహుమతి, తెలుగు వక్తృత్వ పోటీల్లో కె.సిరివల్లి రెండవ బహుమతి, లేఖారచ నలో ఎం. శృతికా ప్రథమ బహుమతి సాధించారన్నారు. తమ పాఠశాలకు చెందిన మరో పది మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు పొందారని శ్రీనివాస్ తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆర్యవైశ్య వనసమారాధన ను విజయవంతం చేయండి

**-పిలుపు నిచ్చిన డా. కొల్లూరి**



**పెడన నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి క్లబ్ మండల ఆర్యవైశ్య సంఘం శ్రీ వాసవి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో బంటుమిల్లి రోడ్డు స్థానిక చిట్టూరి మాధవరావు తోటలోఈనెల 24న ఆదివారం జరగనున్న 27వ ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు ఆర్యవైశ్య దంపతులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములను ఏర్పాటు చేసినట్టు డా. కొల్లూరి చిన్నా తెలియజేశారు. 11 గంటలకు శ్రీ వాసవి మహిళా మండలి వారిచే లలిత పారాయణ లింగాష్టకం చదువుతారని మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని డా. కొల్లూరి చిన్నా తెలియజేశారు. పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి వారి ఆధ్వర్యంలో బాల బాలికలకు వివిధ ఆటల పోటీల నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారని డా. కొల్లూరి చిన్నా తెలియజేశారు. పెడన పట్టణ మండల మరియు పరిసర ప్రాంత ఆర్యవైశ్య సోదర సోదరీమణులు అందరూ సకాలంలో విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా డా. కొల్లూరి విజ్ఞప్తి చేశారు

## సీఎం చంద్రబాబు క్రైస్తవుల పక్షపాతి - టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాసు



**విజయవాడ పశ్చిమ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**క్రైస్తవ సమాధుల స్థలాల సేకరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఉత్తర్వుల జారీ చేయటంపై టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాసు హర్షం వ్యక్తం చేశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాసు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటె స్వామి దాసు మాట్లాడుతూ క్రిస్టియన్ అని చెప్పుకునే జగన్ రెడ్డి చేయకలేకపోయిన పని సీఎం చంద్రబాబు చేశాడన్నారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి మెమరాండం ఇవ్వడం జరిగిందని వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడన్నారు. అలాగే ఈ బడ్జెట్ సమావేశాల్లో లో క్రైస్తవుల సంక్షేమానికి 150 కోట్లు కేటాయించి సీఎం చంద్రబాబు క్రైస్తవుల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు.అలాగే విదేశీ విద్య, సబ్సిడీ లోన్స్, జెరూసలేమి యాత్రకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాబోవు రోజుల్లో క్రైస్తవులకు మరిన్ని సంక్షేమ పథకాలు సీఎం చంద్రబాబు అందిస్తారని చెప్పారు. పాస్టర్ల గౌరవ వేతనాన్ని కి కూడా నిధులు మంజూరు చేశాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా ఇన్నర్ వీల్ బోటిక్






**విజయవాడ పశ్చిమ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆర్థిక స్వావలంబన పొందడం ద్వారా మహిళా సాధికారత సాధించడమే లక్ష్యంగా ఇన్నర్ వీల్ బోటిక్ ని ప్రారంభించినట్లు ఇన్నర్ వీల్ ఇండియా అధ్యక్షురాలు సునీత జైన్ చెప్పారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ సన్ షైన్ సహకారంతో కొత్తపేట, కె.బి.ఎన్ కాలేజీ యు.జి.సి ఉమెన్ స్టడీస్ సెంటర్ విభాగంలో ఏర్పాటుచేసిన బోటిక్ ను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం, ఆమె మాట్లాడుతూ కుట్టుపనుల వంటి చేతివృత్తుల ద్వారా మహిళలు ఇంటి నుంచి పనిచేస్తూనే చక్కటి ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. తమలోని నైపుణ్యాలను మరింత పెంచుకోవడం, కాలానికి అనుగుణంగా ప్రజల్లో మారుతున్న ఇష్టాలను తెలుసుకుంటూ వస్త్రాలు డిజైన్ చెయ్యగలిగితే మంచి సంపాదన పొందడం సాధ్యమవుతుందన్నారు. కె.బి.ఎన్. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ క్లబ్ సహకారంతో తమ కాలేజీలో నిత్యం ఉచిత కుట్టు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. సమాజ సంక్షేమ కార్యక్రమాలకు తమ ఉమెన్ స్టడీస్ సెంటర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాస్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేసారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ఉమెన్ స్టడీస్ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ సన్‌షైన్ అధ్యక్షురాలు కరంబీర్ కౌర్ పాల్గొన్నారు.

## దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు ను రక్షించాలి...

**● డిపాజిట్ దారులు, ఉద్యోగులకు న్యాయం చేయాలి... ● ఇళ్లపై లోన్లు తీసుకున్న వారికి వన్ టైం సెటిల్మెంట్ చేయండి ● దుర్గా బ్యాంక్ కి చేయూత నిచ్చి ఆదాయాన్ని సమకూర్చండి ● విజయవాడ నగర సీపీఐ కార్యదర్శి జి. కోటేశ్వరరావు**




**విజయవాడ పశ్చిమనవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హనుమాన్ పేటలోని దాసరి భవన్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో 97 సంవత్సరాల చరిత్ర గల దుర్గా కో–ఆపరేటివ్ బ్యాంక్ పేద, మధ్యతరగతి, బలహీన వర్గాల వారికి అందుబాటులో ఉంటూ సేవలందించింది. కొంతమంది స్వార్థపరుల ప్రయోజనాలు వలన, మరియు కో–ఆపరేటివ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వలన నేడు లైసెన్స్ రద్దు కాబడటం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవానికి బ్యాంకు లైసెన్స్ రద్దు చేయనవసరం లేదు. నేటికీ ఆర్థిక పరిపుష్టి ఉందని చెపుతున్నారు. కోపరేటివ్ అధికారులు డిపాజిట్ ధరలకు మొత్తం చెల్లించవలసినది సుమారు 57 కోట్ల మాత్రమేనని, దుర్గా బ్యాంకుకు గవర్నమెంట్ సెక్యూరిటీస్, ఇతర బ్యాంకులలో ఫిక్స్ డిపాజిట్ చేసిన మొత్తం సుమారు 64 కోట్లు ఉన్నాయి, అలాగే బ్యాంకులో ఇళ్లపై తనకా రుణాలు తీసుకున్న ఖాతాదారుల నుండి 42 కోట్ల 65 లక్షలు అసలు వడ్డీతో సహా రావలసి ఉండగా, కో–ఆపరేటివ్ రిజిస్టర్ మరియు అధికారుల పర్యవేక్షణ లోపం వలన సకాలంలో లోను తీసుకున్న వారి నుండి వసూలు చేయకపోవడంతో వడ్డీలకు వడ్డీలు పెరిగిపోయి 220 కోట్లకు చేరుకుంది .ఇప్పుడైనా జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ చొరవ తీసుకొని వన్ టైం సెటిల్మెంట్ చేస్తే 42 కోట్ల 65 లక్షలకు తోడు వడ్డీ కొంత మినహాయింపు ఇచ్చిన వసూలుకు అవకాశం ఉంటుంది . డి .ఐ. సి. జి. సి. వారి ద్వారా ఐదు లక్షల లోపు ఉన్నవారికి చెల్లింపులు జరుగుతాయి అంటున్నారు, కాబట్టి దుర్గా బ్యాంక్ ఇతర బ్యాంకుల్లో చేసిన డిపాజిట్లను ఉపసంహరింపజేసి 5 లక్షలకు పైబడిన వారికి చెల్లించేందుకు చర్యలు తీసుకోవలసినదిగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

**థర్డ్ పార్టీకి అప్పచెప్పేందుకే కుట్ర** దుర్గా బ్యాంకు లైబిలిటీ సుమారు 57 కోట్లు ఉండగా, ఆస్తులు 63 కోట్ల 30 లక్షలు రూపాయలు, మరియు ఇళ్లపై అప్పు తీసుకున్న వారి నుండి అసలు 42 కోట్ల 65 లక్షలు వీటిపై వచ్చే వడ్డీ , మరియు నగరంలో మూడు బ్రాంచీలు సొంత బిల్డింగులు కలిగిన ఆస్తి అన్ని పరిశీలించుకుంటే ఇంకా లాభాల్లోనే ఉంటుంది .బ్యాంకు లైసెన్స్ రద్దు చేయడం ద్వారా బ్యాంకును అస్థిరపరిచి ఈ మొత్తాలను కొంతమంది వ్యక్తుల ప్రయోజనానికి అప్పగించేందుకు జరిగే కుట్రలో భాగమే ఈ రద్దు అని ఆరోపించారు.లిక్విడేటర్ అపాయింట్మెంట్, చేయడం .కావున సుదీర్ఘకాలం పాటు నగరంలో పేద మధ్యతరగతి వారికి సేవలందించిన కోఆపరేటివ్ బ్యాంక్ ను తిరిగి కొనసాగించేందుకు స్థానిక శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ చౌదరి, బోండా ఉమామహేశ్వరరావు చొరవ తీసుకో తీసుకోవాలని డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు కార్యదర్శివర్గ సభ్యులు కె.వి. భాస్కరరావు పంచదార్ల దుర్గాంబ,తాడి పైడియ్య, కొట్టు రమణారావు, అప్పర బోతు రాము లు పాల్గొన్నారు.

## పని పాట లేని పోతిన మహేష్ కి కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మే టమే పని

**జనసేన పార్టీ విజయవాడ ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుపతి సురేష్**




**విజయవాడ పశ్చిమ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పనీ పాటలేని పోతిన వెంకట మహేష్ ఎన్డీయే కూటమి ప్రభుత్వం పై విషం చిమ్మడమే పనిగా పెట్టుకొన్నాడని జనసేన పార్టీ విజయవాడ నగర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుపతి సురేష్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు.వైన్ షాపుల గురించి పోతిన మహేష్ తెగ మాట్లాడుతున్నాడు గత మీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలించినప్పుడు విజయవాడలో ఎన్ని వైన్ షాపులు ఉన్నాయో ఒకసారి చెక్ చేసుకోండని సలహా ఇచ్చారు.గతంలో మీ ప్రభుత్వం వైన్ షాపులు నడిపినప్పుడు గవర్నమెంట్ టీచర్లతో గుడిల దగ్గర బడుల దగ్గర నడిపిన వైన్ షాపులు అన్నిటిని ఈ రోజున మా ప్రభుత్వం వచ్చాక అక్కడి నుంచి మా అధికారులు తీయించారనే విషయాన్ని గుర్తు చేసుకొని మాట్లాడాలన్నారు.గతంలో ఉన్న 59 వైన్ షాపులే ఈరోజున కూడా విజయవాడలో ఉన్నయి కానీ గుడిలు దగ్గర బడుల దగ్గర ఉన్న వైన్ షాపులన్నిటిని మార్చుకునే క్రమంలో అవి రోడ్డు మీదకు వచ్చి ఉంటాయని తిరుపతి సురేష్ వివరించారు.మా కూటమి ప్రభుత్వంలో పర్మిషన్ ఇచ్చిన 59 షాపులు విజయవాడ సిటీ లో ఎవరు ఎక్కడైనా నిబంధనల ప్రకారం పెట్టుకోవచ్చుకానీ మొత్తం షాపులు 59 మాత్రమే ఉంటాయి.మీరు నిన్న లెక్కేసారు కదా..? వీడియో తీయడానికి కావాలంటే విజయవాడలో ఉన్న షాపులు అన్నిటిని కూడా మీరు లెక్కేసుకోవచ్చు...ఏమి చూడకుండా ప్రజలకు మాయమాటలు చెప్పి నమ్మించే ప్రయత్నంలో ఉన్నారని సురేష్ ఆరోపించారు.ఈ వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులుగతంలో మీఅధి నాయకుడు ఇలాంటి అబద్దాలు చెప్పి అధికారం లోకి వచ్చాడు. మీ పార్టీలో ఉన్న నాయకులందరూ అబద్ధం చెప్పే అదే నిజమని ప్రచారం చేయడంలో దిట్టా అని ప్రజలందరూ గమనించారని అందుకే మీకు తగిన బుద్ధి చెప్పారని సురేష్ ఘాటుగా విమర్శించారు.ఈ సమావేశంలో తిరుపతి సురేష్ తో పాటుగా ఎమ్ డి అయ్యాజ్, తిరుమరెడ్డి గణేష్ పాల్గొన్నారు.



## కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలని వినతి

**పుత్తూరు నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగిరి నియోజకవర్గం, పుత్తూరు పట్టణంలోని జండా మాను వీధిలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లోని ఎస్ఐకి వినతి పత్రం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్కరి దగ్గర దాదాపు రూ. 5వేల నుంచి రూ. 15వేల వరకు డబ్బులు కట్టించుకున్నారని తెలిపారు. విద్యార్థులు తరగతులు ఎప్పటి నుంచి మొదలు పెడతారని అడుగుతుంటే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తెలిపారు.

## తెలుగుదేశం పార్టీ 37 వ డివిజన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**● ముఖ్య అతిథిగా పాల్గొన్నా తెదేపా యువనేత కాండ్రేగుల రవేంద్ర**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెదేపా సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయి నాయకులు ఎంతో బాధ్యతగా చేయడం అభినందనీయమని తెదేపా యువ నాయకులు కాండ్రేగుల రవేంద్ర అన్నారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 37 వ,డివిజనులో గురువారం తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కాండ్రేగుల రవేంద్ర ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం. ఎమ్ పి కేసినేని శివనాథ్ (చిన్ని) సారధ్యములో ఈ కార్యక్రమం నిర్వహించారు. 37 వ డివిజన్ పిల్లా సుదర్శన్ రావు 37వ అధ్యక్షులు అధ్యక్షతన ఈ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ వెంకట సుబ్బారావు, అమర గోపాలకృష్ణ ,ముప్పల జయరాం, గుండెల చిట్టి , అడ్డూరి లక్ష్మణ, మెండి జ్యోతి, అడ్డురి లక్ష్మి యూనిట్ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే ఐఎంఏ రాష్ట్ర సదస్సు ప్రారంభం !

**ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టి. సేవకుమార్**

**గుంటూరు టౌన్ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ నిర్వహిస్తున్న ఐఎంఏ 66వ వార్షిక సదస్సు మొదట రోజు...రేపు శుక్రవారం ఉదయం 9 గంటలకు గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ప్రారంభమవుతుందని ,సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, డాక్టర్ టి. సేవకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ సభలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి సుందరాచారి ,జి .జి. హెచ్ సూపరిన్డెంట్ డాక్టర్ రమణ ఎస్. ఎస్ .వి ,ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి .ఫణిధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సభ అనంతరం అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇకోకార్డియోగ్రఫీ ,ఈసీజీ ,ఎక్స్ రే ,బి ఎల్ ఎస్ (సి పి ఆర్) తదితర అంశాలపై వర్క్ షాప్ ప్రారంభమవుతుందన్నారు .ఈ వర్క్ షాప్లో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వై.వి.ఎస్ ప్రభాకర్ ,డాక్టర్ పి .విజయ, డాక్టర్ వి .రామతారకనాథ్, డాక్టర్ పి.ఎన్.ఎస్ .హరిత అధిక సంఖ్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, వైద్యులు పాల్గొంటారన్నారు.

## 100% సబ్సిడీతో ఆయిల్ ఫామ్ మొక్కలు

**● ఉద్యానవన శాఖ అధికారి పి.లక్ష్మి**



**చేజర్ల నవంబరు 21 (వార్తాప్రభ)** మండలంలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి ఉద్యానవన అధికారి సమావేశం నిర్వహించారు.సూక్ష్మ సేద్య పథకాలు ఉద్యానవన పథకాలు గురించి అవగాహన కల్పించడం జరిగినది.అలాగే బిందు మరియు తుంపర్లు నీటి సాగు పథకాలు వైపు రైతులను ప్రోత్సహించాలని రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని తెలియజేశారు.అలాగే ఉద్యానవన శాఖ తరపున 100% రాయితీలో ఆయిల్ ఫామ్ మొక్కలను రైతులకు అందించబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంకు ఉద్యానవన శాఖ అధికారి పి.లక్ష్మి మరియు చేజర్ల మండల వ్యవసాయ శాఖ అధికారి వి.శశిధర్ రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## చెనికల వెంకటేశ్వరరావును పరామర్శించిన దారపనేని



**కనిగిరి నవంబర్ 21 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఉప సర్పంచ్ చెనికల వెంకట స్వామి సోదరుడు చెనికల వెంకటేశ్వరరావు విజయవాడలోని రూపా ఆర్థోపెటిక్ కార్పొరేట్ హాస్పిటల్లో మోకాలు ఆపరేషన్ చేయించుకున్నారు. గురువారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ హాస్పిటల్ కి వెళ్లి చెనికల వెంకటేశ్వరరావు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య చెనికల మాల కొండయ్య (పెద్దాయన) బొడ్డు రవి పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమం



**కలువాయి నవంబరు 21 (వార్తాప్రభ)** మండలంలోని తోపుగుంట గ్రామం లోని రైతు సేవ కేంద్రం నందు రైతులకు హార్టికల్చర్ పంటలైన నిమ్మ మరియు బొప్పాయి పంట సాగుపై కృషి విజ్ఞాన కేంద్రం వెంకటగిరి సైంటిస్టులు డాక్టర్ తిరుపాలు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి సలహాలు ఇచ్చారు.వీరు పంటలు సాగు యాజమాన్యం ఎరువులు వాటికి అవసరం అయినా పురుగు మందుల గురించి వివరించడం జరిగింది. అలాగే రైతులకు తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పొదలకూరు హార్టికల్చర్ అధికారి ఆనంద్, కలువాయి హార్టికల్చర్ అధికారి మృథిలా , విఏఏ శ్రీనివాసులు, విహెచ్ఏ నరేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నగరంలో పలువురు డాక్టర్లు ఖరీదైన వైద్యం

- చితికి పోతున్న బీద ,మధ్య తరగతి కుటుంబాలు
- చిన్నపాటి జ్వరానికి వేల రూపాయల బ్లడ్ టెస్ట్ లు



**మచిలీపట్నం నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో కొంతమంది డాక్టర్లు మెడికల్ ,బ్లడ్ టెస్ట్ లు నిర్వహిస్తూ ఖరీదైన వైద్యం చేస్తున్నారు. నాడు ప్రజలకు సేవా గుణంతో ఉండే వైద్యవృత్తి నేడు వ్యాపారంగంగా కోట్లు గడిస్తూ బీద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యం అందరిని ద్రాక్షగా మార్చారు. ప్రజల ఆరోగ్యంమే ధ్యేయంగా వైద్యులు విధులు నిర్వహిస్తారు. ప్రస్తుతం వైద్యం కార్పోరేట్ స్థాయికి ఎగబాకి సామాన్య ప్రజలకు అందని ఎత్తుకి ఎదిగిపోయింది.ప్రభుత్వ ఆసుపత్రులు ఉచితంగా వైద్యం అందిస్తారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులను సరిగా పట్టించుకోరని అపోహతో ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతున్నారు. ఇదే అదును చూసుకొని కార్పొరేట్ వైద్యం కోరల చాచింది. బీద బిక్కి మధ్యతరగతి కుటుంబాలను వైద్యం పేరుతో ఛిద్రం చేస్తోంది. చిన్నపాటి జ్వరం వస్తే పారాసెటమాల్ మందు గోలీలతో తగ్గిపోయే వైద్యానికి ఆ టెస్టులు ఈ టెస్ట్ లు అంటూ వేలల్లో దోచుకుంటున్నారు2020 లో ప్రళయం, ఉప్పెన మాదిరిగా దేశం పై దండెత్తి వచ్చిన కరోనా వైరస్ ప్రజల ఆరోగ్యంతో పాటు ధనవంతులను సైతం బీదలుగా మార్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కరోనాలో వ్యాపారాలు, ఉద్యోగాలు ,సేవలు నిలిచిపోయాయి ఒకే ఒక్క రంగం అత్యాశతో ఉన్న కొంతమందిని ఐశ్వర్యవంతులుగా మార్చింది. కొన్ని ప్రాంతాలలో అతి తక్కువ 5 రూపాయలు ఫీజు తో వైద్యం చేసే డాక్టర్లు లేకపోలేదు, ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేసే డాక్టర్లు ఉన్నారు. ఎవరు ఎటు పోతే మాకేంటి అంటూ వైద్యం పేరుతో దోచుకు తింటున్న వైద్యులు లేకపోలేదు.వైద్యం చేసే డాక్టర్లే మందులు ఫార్మసీ, బ్లడ్ టెస్ట్, ఎక్స్ రే, స్కానింగ్ అంటూ లాభసాటి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ వ్యాపారాలపై జిల్లా ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం బీద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రోగులను మరింతగా కలవరపెడుతుంది. రోజువారి కూలి నాలి పనులు చేసుకునీ అల్ప ఆదాయంతో జీవనం సాగిస్తున్న పేదలు జ్వరం వస్తే కార్పొరేట్ హాస్పటల్ లపై ఆధారపడి అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వాలు వైద్యంపై కొన్ని కోట్లు ఖర్చు పెడుతున్నా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు తమ వైద్యంతో పేదవాడి కి నమ్మకం కలిగించడం లేదు అనే తీవ్ర విమర్శలు ఉన్నాయి.మచిలీపట్నం నగరంలో ఉన్న కొన్ని ఆసుపత్రులపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రులను పర్యవేక్షించి తనిఖీ చేసే అధికారులు లేకపోవడం శోచనీయం. ప్రైవేట్ ఆసుపత్రులలో నార్మల్ డెలివరీలకి ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా జిల్లా అధికారులు మొత్తుకుంటున్న వినిపించుకోవడం లేదు. గర్భిణీ, ప్రసూతి ఆసుపత్రిలు నిర్వహించే కొంతమంది ప్రముఖ మహిళ డాక్టర్లు తమ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ చెయ్యవలసి ఉన్న అందుకు భిన్నంగా ఆపరేషన్ చేస్తూ ప్రభుత్వ అధికారులకు సవాల్ విసిరే స్థాయికి ఎదిగింది ఈ కార్పొరేట్ వైద్యం. ఏది ఏమైనా నగరంలో ఉన్న ఆస్పత్రులపై అధికారులు పర్యవేక్షణ ఉండాలని, ఫార్మసీ, బ్లడ్ టెస్ట్ లు, స్కానింగ్ సెంటర్ లపై తనిఖీలు నిర్వహించి కార్పొరేట్ స్థాయి లో ఎదిగిన వైద్యాన్ని బీద ,మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందే విధంగా చూడాలని ప్రజలు కలెక్టర్ ను కోరుతున్నారు.

## ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**విద్యార్థులకు బహుమతులు ప్రదానం**



**అనుమసముద్రంపేట నవంబర్ 21 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నాటితో ముగిసాయి ఈ సందర్భంగా ఏఎస్పేట గ్రంథాలయ శాఖ లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని ఏపీ మోడల్ హై స్కూల్ కాలేజీ నందు ప్రత్యేక సమావేశాన్ని ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ హుస్సేన్ పీరా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత వారం రోజుల నుండి జరిగిన వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన వకృత్వము దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు ఈ మేరకు పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు అలాగే లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యులుగా చేరి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు గ్రంథాలయంలోని నీతి కథలు జనరల్ నాలెడ్జ్ జీవిత చరిత్రలు చదవడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వం కలిగి మంచి పౌరులుగా ఉన్నత స్థాయికి చేరవచ్చని తెలిపారు ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు నాణేల సేకరణ కర్త ఎండి వాయిజ్ మోడల్ హై స్కూల్ లైబ్రరీ ఇంచార్జ్ వేణు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సేవకులు తూనికుంట్ల శ్రీనివాసు,చిట్టా అమర సుధీర్ లు




**విజయవాడ పశ్చిమ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వేలాదిమంది విద్యార్థులకు సమున్నతమైన మార్గదర్శనం చేస్తూ, విద్యాసంస్థల నిర్వహణను సమాజ సేవకు మార్గంగా ఎంచుకున్న తూనికుంట్ల శ్రీనివాసు చిట్టా అమర సుధీర్ చేస్తున్న విద్యాసేవ ఎంతో ప్రశంసనీయమైనదని పలువురు వక్తలు కొనియాడారు. సెంట్రల్ అమెరికా యూనివర్సిటీ నుంచి కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి చిట్టా అమర సుధీర్ గౌరవ డాక్టరేట్లు అందుకున్న సందర్భంగా గురువారం కేబీఎన్ కళాశాలలో సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ శ్రీనివాసు సుధీర్ ల ముందుచూపు చాలా ఉన్నత స్థాయిలో ఉంటున్నదని వారు ప్రవేశపెట్టిన సంస్కరణ వల్లే కేబీఎన్ మరియు పొట్టి శ్రీరాములు కళాశాలలు రాష్ట్రంలోనే ఉత్తమ స్థాయిలో ఉన్నాయని ప్రశంసించారు. కమిటీ అధ్యక్షులు పి శేషయ్య మాట్లాడుతూ శ్రీనివాసు బహుముఖీనమైన ప్రజ్ఞను కొనియాడారు. అనేక సమస్యల లో చిక్కుకున్న కేబీఎన్ కళాశాలను శ్రీనివాసు తన నాయకత్వ పటిమతో పరిష్కరించి నాట్ ఏ డబల్ ప్లస్ సాధించే స్థాయికి తీసుకువచ్చారన్నారు. కేబీఎన్ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముందుచూపు అకుంఠిత పరిశ్రమ నిరంతర ప్రణాళిక సుధీర్ మరియు శ్రీనివాసులను గౌరవ డాక్టరేట్ అందుకునే స్థాయికి తీసుకువెళ్లాయన్నారు. అనంతరం తూనికుంట్ల శ్రీనివాసు అమర్ సుధీర్లను హిందూ హైస్కూల్స్ కమిటీ పక్షాన ఘనంగా సత్కరించారు. కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణవేణి హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి నారాయణ రావు కూడా పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో 7 మంది అరెస్ట్ : డీఎస్పీ

**కుప్పం నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**చిత్తూరు జిల్లా రామకుప్పంలో గోవిందప్ప కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఇన్ చార్జ్ డీఎస్పీ ప్రభాకర్ గురువారం తెలిపారు. రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కేసును ఛేధించినట్లు చెప్పారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. కిడ్నాప్ ఉపయోగించిన మూడు కార్లను సీజ్ చేశామన్నారు.

## గేదెలపై గుర్తు తెలియని జంతువు దాడి

- చిరుత దాడిగా అనుమానం పడ్డ గ్రామస్తులు
- అది అడవి పంది దాడిగా ఉందని తెలిపిన ఫారెస్ట్ అధికారులు





**కలువాయి , నవంబర్ 21 (వార్తప్రభ):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలం దాచూరు గ్రామంలో గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో రెండు గేదెలు గాయపడ్డ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బుధవారం రోజున గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి తనకు చెందిన గేదెలను మేత కోసం అని దాచూరు చెక్ డ్యామ్ సమీపంలోని వారి పొలాల్లోకి తొలి వారు ఇంటికి వచ్చేసారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన గేదెలకు తగిలిన తీవ్రమైన దెబ్బలను చూసి వాటిపై ఏదో జంతువు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిందని ఇంటికి చేరుకున్న గేదెలను చూసి యజమాని చలించిపోయాడు. గేదెలు మీద దాడి చేసిన జంతువు ని గుర్తించాలని ఆయన అటవీశాఖ అధికారులను కోరుకున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అడవిపందిగా అనుమానిస్తున్నారు. కానీ గ్రామస్తులు గేదెలనే ఆ విధంగా గాయపరిచిన జంతువు ఏదైనా సరే మనుషుల పైన దాడి చేస్తే చాలా ఇబ్బందులు ఉంటాయని భయభ్రాంతులకు గురవుతున్నారు. కావున అటవీ శాఖ అధికారులు స్పందించి ఆ జంతువుని గుర్తించాలని కోరుకుంటున్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

- రెవెన్యూ డివిజన్ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసిన రైతు, కౌలు రైతుల సంఘాల నాయకులు



**మునునూరు నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):**రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక పోవడంతో అప్పులు భారం పెరిగిపోయి తీర్చే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రక్షణ కల్పించాలని వారు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలన్నీ మాఫీ చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఏలూరు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి దొంతకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పి.జమలయ్య, దొంత కృష్ణ ,నిమ్మగడ్డ నరసింహ, కె.ఆనంద్ లతో కూడిన ప్రతినిధి బృందం గురువారం ఏలూరు జిల్లా, మునునూరు మండలం,రమణక్కపేట గ్రామంలో గత రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకు నాగబోయిన రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శిం చారు.వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రాజశేఖర్ ఆత్మహత్య చేసుకోవటానికి గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ రాజశేఖర్ కు తండ్రి చిన్నప్పుడే చనిపోయారనీ,తల్లి మాత్రం ఉందనీ,ఇతనికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారని వీరిలో ఒకరికి సంవత్సరం 4నెలలు కాగా మరో పాప కు 6 నెలలు ఉన్నాయని తెలిపారు.రాజశేఖర్ కుటుంబానికి సెంటు భూమి కూడా లేదని,గత పదిహేను సంవత్సరాల నుంచి భూమిని కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న సీడ్ ఉత్పత్తి సాగు చేస్తున్నారనీ,సీడ్ ఆర్గనైజర్లు నాణ్యమైన సీడ్ ఇవ్వకుండా మోసగిస్తుండటంతో పంట దిగుబడి సరిగా రాకపోవడం కనీసం పెట్టిన ఖర్చులు కూడా దక్కకపోవడంతో ప్రతి ఏడాది అప్పుల భారంతో వ్యవసాయం సాగు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న సీడ్ ఉత్పత్తి తో పాటు మరో ఐదు ఎకరాలు మామిడి తోటను లీజుకి తీసుకొని పండిస్తున్నాడనీ,ప్రతి ఏడాది పెరిగిన సాగు ఖర్చులు వచ్చిన దిగుబడికి గిట్టుబాటు లేక రాజశేఖర్ సుమారు రూ.10 లక్షలు వరకు అప్పు చేశాడని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిందన్నారు.ఈ మొత్తం వ్యవసా యానికి చేసిన అప్పులే అని బాధిత కుటుంబ సభ్యులు చెప్పినట్లు రైతు, కౌలు రైతుల సంఘాల నాయకులు తెలియజేశారు.మృతుడు రాజశేఖర్ స్వతహాగా కౌలురైతు కాబట్టి ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదనీ, కౌలుగుర్తింపు కార్డు రాకపోవడం చేత బ్యాంకులు కూడా అప్పు ఇచ్చే పరిస్థితి లేకపోయిందన్నారు.నూటికి రెండు రూపాయలు వడ్డీకి తీసుకువచ్చి పంట లు పండిస్తున్నారని,రైతు ఆత్మహత్య చేసుకుని మూడు రోజులైనా రెవెన్యూ వ్యవసాయ అధికారులు ఎవరు కూడా ఆ గ్రామానికి వెళ్లి రైతులతో పరామర్శిం చింది లేదన్నారు. రైతు సాగు చేస్తున్న పంటలు ఈ క్రాప్ లో కూడా నమోదు చేసిన పరిస్థితి లేదన్నారు.బాధిత కుటుంబానికి ఏ ఆధారం లేని పరిస్థితి ఏర్పడిందన్నారు.కుటుంబ యజమాని గా పెద్ద దిక్కుగా ఉంటాడనుకున్న కుమరుడు కళ్ళ ఎదుట ప్రాణాలు విడిచాడని తల్లి తన ఆవేదనని భార్య అంజలి ఆమె దుఃఖానికి అవధులు లేవన్నారు.తండ్రి ఎందుకు చనిపోయాడో,ఉన్నాడో లేడో కూడా తెలియనటు వంటి పసిప్రాయంలో పిల్లలు ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు ఏ ఆధారం లేని అనాధగా మిగిలిపోయిన రాజశేఖర కుటుంబానికి తక్షణమే10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే చదువుకున్న రాజశేఖర భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇప్పించాలని కోరారు.పసిప్రాయంలో ఉన్న పిల్లలకు భవిష్యత్తులో చదువులకు అవసరమై న ఖర్చును ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.సాగు కోసం చేసిన అప్పులను రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకొని ఆ అప్పులు తీర్చి కుటుంబా నికి అండగా నిలబడాలని కోరారు. అనంతరం రెవెన్యూ డివిజన్ ఉన్నతాధి కారులకు రైతు, కౌలు రైతుల సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు ఎస్సై సునీత సైబర్ క్రైమ్,ఆన్లైన్ మోసాలపై అవగాహన



**కాకినాడ రూరల్/కరప నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కరప మండలం పెనుగుదురు సంధ్య ఫిజియోథెరపీ కాలేజీలో కరప ఎస్సై టి.సునీత గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యారినీ,విద్యార్థులకు సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలు, యాంటీ ర్యాగింగ్, రేష్ డ్రైవింగ్,రోడ్డు ప్రమాదాలు నివారణకు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కాకినాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు మేరకు కాకినాడ డిఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో కరప ఎస్ఐ కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఉన్న సంధ్య ఫిజియోథెరపీ కాలేజ్ లో సైబర్ నేరగాలు పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ మేనజర్ లా మాట్లాడుతున్నట్లు బ్యాంక్ కస్టమర్ కి ఫోన్ చేసి మీ ఈ కే వై సి అప్డేట్ అవ్వలేదని, ఈ కే వైసీ అప్డేట్ చేస్తాము ఓటీపీ చెప్పమని చెప్పకపోతే మీ అకౌంట్ బ్లాక్ అవుతుంది. మీ డబ్బులు పోతాయని, సైబర్ నేరగాళ్ళు భయపించి ఓటీపీ అడుగుతారు . వారికి ఎటువంటి ఓటీపీ చెప్పకూడదు, వారికే కాదు ఎవరకి కూడా మీ ఫోన్ కి వచ్చిన ఓటీపీ ఎవరకి చెప్పకూడదు, చెబితే మీ అకౌంట్ లో డబ్బులు పోతాయి. మీ యొక్క ఫోన్ కు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తి ఒక లింకు పంపి ఫెస్టివల్స్ సందర్భంగా మీకు డిస్కౌంట్ లు వస్తాయి అని మనకి ఆశ చూపి లింకు క్లిక్ చేయమని చెబుతారు, మనం ఒకవేళ ఆ లింకు క్లిక్ చేస్తే మన అకౌంట్ లో డబ్బులు పోతాయి. . ఓ ఎల్ ఎక్స్ లో మోటార్ సైకిల్, లాప్ టాప్ లు మరియు కొన్ని వస్తువులు అతి తక్కువ రేటుకు ఇస్తున్నట్లు సైబర్ నెరగాళ్లు మన దగ్గర డబ్బులు కాజేస్తారు మనం ఒక వేల సైబర్ నెరగాల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 1930 కి ఫోన్ చేసి జరిగిన విషయం వారికి చెబితే వారు మీ పేరు మీద కంప్లైంట్ నమోదు చేసి మీ అకౌంట్ నుండి పోయిన డబ్బులు వాడు వాడుకోకుండా అతని అకౌంట్ నిలుపుదల చేస్తారు. కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ సైబర్ నేరగాళ్లకి సంబంధించి కొన్ని వీడియో లు ప్రొజెక్టర్ ద్వారా స్టూడెంట్స్ కి చూపించినారు. ఏ ఎస్ ఐ సూరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టర్ గౌతమ్, డాక్టర్ అక్షయ, ఏ ఓ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.1లక్ష యాభై వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్.వో.సి అందజేత



**విజయవాడ పశ్చిమ నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రెండు కిడ్నీలు ఫెయిలై అనారోగ్యంతో భాదపడుతూ హైదరాబాద్ లో నిమ్స్ చికిత్స పొందుతున్న కొప్పనాతి నాగలక్ష్మీ తన కిడ్నీ ఆపరేషన్ కోసం తక్షణ ఆర్థిక సాయం కోరుతూ సీఎంఆర్ఎఫ్ కింద లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.వో.సి) కి ఎంపి కేశినేని శివనాథ్ సాయంతో ఆర్జీ పెట్టుకున్నారు...ఈ మేరకు మంజూరైన రూ.1లక్ష యాభై వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్.వో.సి పత్రాన్ని గురువారం కొప్పనాతి నాగలక్ష్మీ కుమారుడు కొప్పనాతి శ్యామ్ సుందర్ కి ఎంపి కార్యాలయ సిబ్బంది అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎంపి కేశినేని శివనాథ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వో.ఎస్.డి ఎ.వెంకటరత్నం,ముల్పూరి కిషోర్ పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన కనిగిరి ఆయేషా



**కనిగిరి నవంబర్ 21 వార్తా ప్రభ ప్రతినిధి** ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో నిర్వహించిన బంగారు బాల్యం వారోత్సవాలలో భాగంగా స్లొగన్స్ (చైల్డ్ లేబర్ )పోటీలలో కనిగిరి పట్టణానికి చెందిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చెందిన 10వ తరగతి విద్యార్థిని షేక్ ఆయేషా ప్రతిభ చాటి జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన ఆయేషా కు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ దామోదర్ లు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ పోటీలు మండల డివిజన్ స్థాయిలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలువ విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు, తోటి విద్యార్థి విద్యార్థినులు ఆయేషా ను అభినందించారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదానం నిర్వహించిన పర్వతం ప్రసాద్ రెడ్డి



**పామూరు నవంబర్ 21 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో గురువారం పర్వతం ప్రసాద్ రెడ్డి స్వామి, ధర్మపత్ని అలేఖ్య, కుమారుడు ఈశ్వర్ రెడ్డి, బావమరిది శివారెడ్డి అయ్యప్ప మాల స్వాములకు, శివమాల స్వాములకు, ఆంజనేయ స్వామి మాల స్వాములకు, భవాని మాల స్వాములకు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శాశ్వత అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం పర్వతం ప్రసాద్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, దేవస్థానం చైర్మన్లు గుత్తి వెంకటరాజా, కావిటి వెంకటసుబ్బయ్య లు పర్వతం ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓగూరి నరసింహారావు, కంబాల రోశయ్య అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## వలంటీర్ వ్యవస్థ కథ ముగిసినట్టే

**అమరావతి, నవంబర్ 21 వార్తా ప్రభ ప్రతినిధి** ఆంధ్రప్రదేశ్‌లో వలంటీర్ల వ్యవస్థ ఉనికిపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. అసలు ఆ వ్యవస్థ ఉనికిలో లేదని తేల్చి చెప్పింది. 2023 సెప్టెంబర్‌లో రెన్యువల్ చేయాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. జగన్ ప్రభుత్వమే ఆ వ్యవస్థను నాశనం చేసిందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి చెప్పుకొచ్చారు. శాసన మండలిలో వలంటీర్ వ్యవస్థపై తీవ్ర చర్చ జరిగింది. అధికార ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మంత్రి విరాంజనేయస్వామి, మాజీ మంత్రి, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య హీట్ డిస్కషన్ నడిచింది. వలంటీర్ల వ్యవస్థ, వారికి ఇవాల్సిన జీతాలపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు అడిగారు. ఈ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం జీవో 5 ద్వారా తీసుకొచ్చారని మంత్రి వివరించారు.2023 సెప్టెంబర్ అసలు జీవోనే ఇష్యూ చేయలేదని తెలిపారు. అప్పటి వరకు ప్రతి ఏడాది రెన్యువల్ చేస్తూ వచ్చిన ప్రభుత్వం 2023లో మాత్రం రెన్యువల్ చేయలేదని వివరించారు. అసలు ఆ వ్యవస్థనే కొనసాగించలేదు. లేని వారితో రాజీనామాలు చేయించారన్నారు. లేని వాళ్లను చూపించి ఎన్నికల కోడ్ పేరుతో డ్రామాలు ఆడారన్నారు. రెన్యువల్ చేసి జీతాలు పెంపును అమలు చేద్దామని చూస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు మంత్రి డోలా. ఇప్పుడు సాంకేతిక కారణాలతో వారిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వారు ఉద్యోగాల్లో లేకపోయినప్పటికీ మే నెల వరకు జీతాలు ప్రభుత్వం ఖజానా నుంచి ఇచ్చారని తెలిపారు. బొత్స సత్యనారాయణ స్పందిస్తూ... వ్యవస్థ ఉందని దాన్ని రెన్యువల్ చేస్తే సరిపోతుందని అన్నారు. ఎన్నికల కారణంగా ఉత్తర్వులు ఇవ్వలేకపోయి ఉండొచ్చని దాన్ని ఇప్పటి ప్రభుత్వం కొనసాగించడంలో అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. దానికి స్పందించిన మంత్రి డోలా... 2020 నుంచి ఏటా రెన్యువల్ జీవోలు ఇస్తూ వచ్చిన జగన్ ప్రభుత్వం 2023లో జీవో ఇవ్వడానికి వచ్చిన అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యధ్యేయం ప్రయాణిస్తుంది

● కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఎమ్మెల్యే నాలా విస్తరణ పనులు పరిశీలన





**శేరిలింగంపల్లి,నవంబర్ 20 (వార్తాప్రభ):** మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు చేపట్టబోయే నాల విస్తరణ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు నాల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుంది అని,ప్రతి వర్షానికి వరద నీరు చుట్టుపక్కల కాలనీలు ముంచెత్తడం జరుగుతుంది అని,సమస్య శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపట్టడం జరుగుతుంది అని, భవిష్యత్తు లో వరద సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకొని నాల విస్తరణ పనులు చేపడుతున్నాం అని,ఈ నాల విస్తరణ నిర్మాణము పనుల వలన చుట్టుపక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో ఉపశమనం కలుగుతుంది అని,ప్రజలకు సాంత్వన చేకూరుతుందని,ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తీరునని,రాబోయే వర్షాకాలం లోపు పనులు పూర్తిచేయాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. అభివృద్ధి,సంక్షేమం అగకూడదనే ఉదేశ్యం తో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని,అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా నాల విస్తరణ పనులు చేపడుతున్నామని, త్వరితగతిన పూర్తి అయ్యేలా చేస్తున్నామని,రాబోయే వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృష్ట్యా అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ నిర్మాణ పనులను చేపట్టడం జరిగినది అని,యుద్ధప్రాతిపదికన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని,నాల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుడదని,పనుల లో వేగం పెంచాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడలని త్వరితగతిన నాల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. నాల లో పేరుకుపోయిన మట్టిని పూడికతీత ద్వారా వెంటనే తొలగించాలని,నాలా నిర్మాణ పనుల పై పలు సూచనలు,సలహాలు ఇవ్వడం అధికారులకు ఇవ్వడం జరిగినది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతలు,నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా సన్నద్ధం కావాలని,ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముంపుకు గురికాకండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, అదేవిదంగా అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయం తో పని చేసి పనులలో పురోగతి సాధించాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు డిఈ ఆనంద్,ఏఈ జగదీష్ మరియు కాంట్రాక్టర్ పిఎస్ రెడ్డి మరియు ప్రతాప్ రెడ్డి,ఆనంద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి

**-రాష్ట్ర బీసీ శాఖ మంత్రి ఎస్.సవిత**



**అమరావతి నవంబర్ 20 (వార్తాప్రభ):** : సీఎం చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై అసెంబ్లీ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా జరిగిని చర్చలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా ఆనందకరమన్నారు. రాయలసీమ ప్రజల తరఫున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సీఎం చంద్రబాబుతోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు సాధ్యమని రాయలసీమ ప్రజల నమ్మకం పెట్టుకున్నారన్నారు. నేడు ఆ నమ్మకం నిజమైందన్నారు. వెనుకబడిన రాయలసీమలో ఎన్నో పరిశ్రమలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. తాగు, సాగునీరు కల్పనలోనూ సీఎం చంద్రబాబు పాత్రే కీలకమన్నారు. ప్రస్తుతం రాయలసీమలో జరిగిన అభివృద్ధి అంతా చంద్రబాబు చలువేనని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ, రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లోనూ పాలాభిషేకాలు చేయించుకుని, రాయలసీమ వాసులను జగన్ మోసం చేశాడని మండిపడ్డారు. జగన్ రాయలసీమ ద్రోహిగా ప్రజల్లో మిగిలిపోయాడన్నారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై నిన్న(బుధవారం) మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం... ఈరోజు(గురువారం) సభలో బిల్లు ప్రవేశపెట్టడం చాలా ఆనందకర విషయమని మంత్రి సవిత తెలిపారు.

# విద్యుత్తు,ట్రాఫిక్,వాటర్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా

● కార్పొరేటర్ రోజా దేవి రంగారావు



**కూకట్ పల్లి, నవంబర్21(వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ కు సంబంధించిన వడ్డేపల్లి ఎంక్లేవ్ నుండి హెచ్. పి. పెట్రోల్ బంక్ బాలకృష్ణ నగర్ వరకు జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను ట్రాఫిక్ సిఐ ముత్తు యాదవ్ మరియు వాటర్స్ వర్క్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు విద్యుత్తు అధికారులు,కాలనీ వాసులుతో కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ రోడ్డు లో హెవీ ట్రాఫిక్ ఉన్నందున ట్రాఫిక్ సంబంధించిన సమస్యలు,వాటర్స్ కు సంబంధించిన శివరేజ్ లైన్స్, మ్యాన్ హోల్ రిపేర్లు, విద్యుత్తు సంబంధించిన పోల్స్ షిఫ్టింగ్ సమస్యలు ఉన్నందున అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బంది కాకుండా వీలైనంత తొందరగా నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్డు వేయావని జిహెచ్ఎంసి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అమీరుద్దీన్, విద్యుత్తు ఏఈ పీరు నాయక్,వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యం,బాలకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు,శ్రీనివాస్ రెడ్డి, రమణ,విక్రమ్,ప్రవీణ్,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణమే కృషి చేస్తాం

● కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,నవంబర్ 20 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్,సోఫా కాలనీ చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ నాయకులు,కాలనీ వాసులు గురువారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ని గచ్చిబౌలి కార్పొరేటర్ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో ఎన్నాళ్లుగానో ఉన్న డ్రైనేజీకి అవుట్ లెట్ సమస్య చర్యలు తీసుకోవాలని మరియు అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్డు,యూజీడీ పైప్ లైన్ నిర్మాణము పనులను పూర్తి చేయాలని,మంచి నీటి వసతిని,మెరుగుపరచాలని విద్యుత్ సమస్యలను మరియు విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడలని,పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ని కోరగా.. కార్పొరేటర్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీకి అవుట్ లెట్ ను ఏర్పాటుచేసి, అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిపాదనలు సిద్ధం కాగానే నిధులు మంజూరు చేయించి త్వరగా పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తామని తెలిపారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్దంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని. దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని,డ్రైనేజి వ్యవస్థను,మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని కార్పొరేటర్ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజు నాయక్,శ్రీనివాస్,నరసింహ స్వామి,బాలకృష్ణ,వేంకటేశ్వర రెడ్డి, నారాయణ,కృష్ణ,లాల్ సింగ్,విజయ్,హీర్య,మోహన్ బాబు,వెంకటేష్ నాయక్, రాజు,సురేష్,గోపాల కృష్ణ, సత్యనారాయణ రాజు, కళ్యాణ్ నాయక్,రమేష్, హాసన్ భాయ్,ఎన్టీఆర్ నగర్, సోఫా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి-కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్ నవంబర్ 21 (వార్తాప్రభ).** పదవతరగతి,ఇంటర్మీడియెట్ వార్షిక్ష పరీక్షల పై సన్నాహక ల తీరుతెన్నుల పై సమీక్షా నిర్వహించి ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి లో ప్రత్యేక తరగతులు నిర్వహించి డిసెంబర్ నాటికి సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేసి జనవరి నుండి 2025 రివిజన్ చేపట్టాలని సూచించారు. మొదటి సంగ్రహణాత్మక ఫలితాల ఆధారంగా విద్యార్థుల ఏబిసి వర్గీకరణ చేసి సి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక భోధన ద్వార వారి ప్రతిభను మెరుగుపరిచి పదవ తరగతిలో పాస్ అయ్యేలా చూడాలని అన్నారు. అనేక కారణాల వలన తరుచూ పిల్లలు గైర్హాజర్ అయి చదువుకు దూరం అవుతున్నారని, పిల్లలందరినీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అడప్షన్ చేసుకొని,వారి ప్రతిభను, హాజరును పెంపొందిస్తే వంద శాతం రిజల్ట్ ను తీసుకు రావచ్చని అన్నారు. గత సంవత్సరం వార్షిక ఫలితాలలో తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాలల్లో ఎక్కువ దృష్టి సారించింది మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ లో జనవరి, ఫిబ్రవరి లో ప్రాక్టికల్స్ ,వార్షిక పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించాలని,హాజరు శాతాన్ని పెంచడానికి విద్యార్థులను అడాప్షన్ చేసుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా వారికి భోధన చేయాలనీ పూర్తి బాధ్యత వహించి విద్యార్థులను మెరుగు పరచాలని అన్నారు. క్రింది సూచనలు,సలహాలు చేసినారు. పదవ తరగతి,ఇంటర్మీడియెట్ ఫలితాలలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను మొదటి స్థానం లో నిలపాలని కోరారు.

# మత్స్యకారులకు అన్ని విధాల చేయూతను అందిస్తాం

● మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తాం ● అధికారంలోకి రాగానే 217 జీవోను రద్దు చేశాం ● గత ప్రభుత్వ బకాయిలు మూడున్నర కోట్లు, డీజిల్ సబ్సిడీ రూ.34 కోట్లు విడుదల చేశాం ● మత్స్యకారులకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటాం ● మత్స్య శాఖ మంత్రి కే. అచ్చెన్నాయుడు






**విజయవాడ, నవంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి అవకాశాల కోసం సుస్థిరమైన మత్స్య రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ ల మంత్రి కే. అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రపంచ మత్స్య దినోత్సవ వేడుకలు-2024 సందర్భంగా తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి, భద్రత కోసం మత్స్య రంగంలో ఎదురవుతునన క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి ప్రతి ఏటా నవంబర్ 21 న ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుదీర్ఘ తీర ప్రాంతం 1020 కిమీ, 2.26 లక్షల హెక్టార్ల ఆక్వా కల్చర్ అనేక నీటి వనరులను కలిగి ఉందన్నారు. దేశంలో 75 శాతం కంటే ఎక్కువ కల్చర్ రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, భారతదేశం యెక్క ఆక్వా హబ్ గా నిలుస్తుందన్నారు. ఆక్వా రంగానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తే రాష్ట్రానికి అత్యధిక ఆదాయం వస్తుందన్నారు. దశాబ్దాల నుంచి మత్స్యకారులకు స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్.టీ.రామారావు అండగా నిలుస్తున్నారని, ఆ వరవడిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారన్నారు. మత్స్యకారులకు రాజకీయంగా ప్రముఖ స్థానం కల్పించడమే కాకుండా వారికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు మత్స్యకారులను పట్టించుకున్న పాపాన పోలేదని కేంద్రం నుంచి నిధులను కూడా పొందలేకపోయారన్నారు. అంతేకాకుండా 217 జీవో ను తెచ్చి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేరన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా ప్రతి 30 కిలోమీటర్ కు ఒక హార్బర్ కాని ఒక జెట్టీ కాని ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఉండే విధంగా చర్యలు తీసుకుంటే మత్స్యకారులకు మేలు కలుగుతుందన్నారు. 2014-19 లో ఇచ్చిన విధంగా వేట సమయంలో చనిపోయిన వారికి రూ. 5 లక్షలు ఇచ్చేవారమని, గత ప్రభుత్వ సమయంలో చనిపోయిన వారిలో కొద్దిమందికి మాత్రమే చెల్లించి మిగతా వారికి చెల్లించలేదన్నారు. ఆ బకాయిలు మూడున్నర కోట్లు, డీజిల్ సబ్సిడీ రూ. 34 కోట్లు అధికారంలోకి రాగానే మా ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. జోన్, నాన్-జోన్ అనే తేడా లేకుండా అందరికీ విద్యుత్ సబ్సిడీ అందిస్తామన్నారు. మత్స్యకారులకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే బోట్ కు ట్రాన్స్ పాండర్స్ బిగిస్తే చేపలు ఎక్కడ ఉన్నదీ, తుపానుల తీవ్రత, అకాల వర్షాలు తెలుస్తాయని, ఇప్పటికే 4,500 బోట్లకు ట్రాన్స్ పాండర్స్ ఏర్పాటు చేశామని.. రాష్ట్రంలో 30,000 బోట్లకు కూడా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడతూ దేశంలో 1997 నుండి ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, భవిష్యత్ తరాలకు ఈ సంప్రదాయాన్ని అందించేలా రాష్ట్రంలో కూడా నిర్వహిస్తున్నామన్నారు. మత్స్యకారులకు అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని, చాలా పథకాలు ప్రచారంలోకి రావటంలేదన్నారు. మత్స్యకారులకు రూ. 750 కోట్లు బడ్జెట్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు చెల్లించే భృతిని మా నాయకుడు తీసుకొచ్చారన్నారు. జీవో 217 మత్స్యకారుల జీవితాలను అంధకారంలోకి నెట్టిందని...దానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాల చేశామని.. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఆ జీవోను రద్దు చేశామన్నారు. కాకినాడ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) గత ప్రభుత్వంలో మత్స్యకారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆ ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. 217 జీవోకు వ్యతిరేకంగా పోరాడిన సమయంలో చంద్రబాబు నాయుడు మాకు అండగా నిలబడ్డారని.. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఆ జీవోను రద్దు చేశారన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఆక్వా ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను మంత్రులు తిలకించారు. మత్స్యకార రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులతో సత్కరించారు కార్యక్రమంలో శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, ఏపీ పారిశ్రామిక మౌలిక కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మంతెన రామరాజు, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏపీ రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి సాధికార సంస్థ కో వైఎస్ చైర్మన్ ఆనం వెంకట రమణ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక పాడి అభివృద్ధి మరియు మత్స్య శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్, మత్స్యశాక కమిషనర్ టి. డోలా శంకర్, వివిధ మత్స్యకార సంఘాల ప్రతినిధులు తదితరలు పాల్గొన్నారు.

# సంక్రాంతి పోటీపై ఓ క్లారిటీ ఇచ్చేసిన వెంకీ

టాలీవుడ్‌లో సంక్రాంతి పండగ అంటేనే స్టార్స్ మధ్య పోటీ ఉండడం కామన్. కానీ ఈసారి సంక్రాంతి పోటీ చాలా డిఫరెంట్ గా ఉండబోతోంది. గేమ్ ఛేంజర్ - డాకూ మహరాజ్ తో పాటు మరో మాస్ ఎంటర్టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమవుతోంది. విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్ కలయికలో వస్తున్న ఈ సినిమా ట్రైయాంగుల్ స్టోరీతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా 2025 జనవరి 14 సంక్రాంతి పండగ సందర్భంగా విడుదల కానుంది. ఇక నేడు రిలీజ్ డేట్ ఎనౌన్స్ మెంట్ పై ప్రత్యేకంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ ఈ చిత్రంపై ప్రత్యేకంగా స్పందించారు. "ఈ సినిమా పేరే 'సంక్రాంతికి వస్తున్నాం.' సంక్రాంతి పండగ కోసం ఎంటర్టైనర్‌గా దీన్ని తెరపైకి తీసుకురావాలని నిర్ణయించాం. అందరికీ ఈ సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ కథా చిత్రాలతో పాటు యాక్షన్, క్రైమ్ ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. ఫ్యామిలీ ఆడియన్స్ మాత్రమే కాదు, మాస్ ఆడియన్స్ కూడా బాగా ఎంజాయ్ చేస్తారు," అని చెప్పిన వెంకటేష్, సినిమా చూసి ప్రేక్షకులు తృప్తి పొందుతారని అభిప్రాయపడ్డారు. వెంకటేష్ తన పాత్ర గురించి మాట్లాడుతూ, "ఈ పాత్ర నా కెరీర్‌లో ప్రత్యేకమైనది. గెటప్, మేకోవర్ చాలా కొత్తగా ఉంటాయి. ఈ సినిమాలో నాకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. అనిల్ రావిపూడి నాకు అద్భుతమైన కథతో వచ్చారు. ఆయనతో పని చేయడం ఎప్పుడు హ్యాపీగా ఆనందంగా అనిపిస్తుంది. ఈ కథ ఎంటర్టైనింగ్‌గా ఉండడమే కాదు, భావోద్వేగాలతో నిండి ఉంటుంది. కుటుంబ కథాచిత్రాలకు నా అభిమానులు ఇష్టపడతారని నాకు తెలుసు. కానీ ఈసారి కొత్తగా ట్రీట్ అందించబోతున్నాం" అని అన్నారు. ఈ సినిమాలో వెంకటేష్ సరసన ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఒకరు అతని ప్రస్తుత భార్యగా, మరొకరు ఎక్స్ లవర్ గా కనిపించనున్నారు. ఈ పాత్రలు కథలో కీలక మలుపులు తీసుకొస్తాయి. సంగీతం భీమ్స్ సిసిరోలియో అందించగా, రమణ గోగుల పాడిన మొదటి పాట త్వరలోనే విడుదల కానుంది. ఇక సంక్రాంతి బరిలో పోటీ పై కూడా వెంకటేష్ స్పందించారు. 'గేమ్ చేంజర్,' 'డాకూ మహారాజ్' వంటి పెద్ద చిత్రాలు కూడా రానున్నాయి, అన్ని సినిమాలు హిట్ అయితేనే ఇండస్ట్రీ బాగుంటుంది అని వెంకటేష్ స్పష్టం చేశారు. "ఇతర సినిమాల విజయంతో పాటు మా సినిమా కూడా ప్రేక్షకుల మన్ననలు పొందుతుంది. మా టీమ్ ఎంతో కష్టపడి పనిచేసింది. ఈ సినిమా అందరికీ ఒక మంచి పండగ ట్రీట్ అవుతుందనే నమ్మకం ఉంది," అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంతకు ముందు అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబోకు బ్లాక్ బస్టర్ హిట్ రికార్డ్ ఉండగా, ఈసారి కూడా అదే విజయం కొనసాగుతుందనే ఆశతో సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతోందని దిల్ రాజు అన్నారు.

# దర్గాలో చరణ్.. విమర్శలపై ఉపాసన కౌంటర్!





టాలీవుడ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మంగళవారం కడప దర్గా సందర్శనతో అక్కడి జనాలను ఎంతగానో ఎట్రాక్ట్ చేశాడు. అయ్యప్ప మాలలోనే చరణ్ అక్కడకు రావడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. సంగీత దర్శకుడు రెహమాన్ కు ఇచ్చిన మాట మేరకు దర్గాకు వెళ్లిన చరణ్, అక్కడి మతపరమైన సంప్రదాయాలను గౌరవిస్తూ ఆత్మీయతను చాటుకున్నారు. అయితే, ఈ విషయంపై పలువురు ప్రశంసలతో పాటు కొన్ని విమర్శలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల, ఈ వివాదంపై తనదైన శైలిలో స్పందించారు. ఉపాసన సోషల్ మీడియాలో చరణ్ దర్గా సందర్శన ఫోటోను షేర్ చేస్తూ, భారతీయ సంస్కృతిలో అన్ని మతాలను గౌరవించేందుకు ప్రాముఖ్యత ఉందని చెప్పారు. "మత విశ్వాసాలు మనల్ని ఒకటిగా మారుస్తాయి. రామ్ చరణ్ తన సొంత విశ్వాసాలను గౌరవించడమే కాకుండా, ఇతర మతాల పట్ల కూడా ఆదరణ చూపిస్తున్నారు. ఇది మన భారతీయతను మరింత బలంగా నిలబెడుతుంది," అంటూ ఉపాసన స్పష్టం చేశారు. ఇక ఉపాసన ఆ విధంగా స్పందించగా విమర్శలకు దిగిన ఓ నెటిజన్, "ఇతర మతాలను గౌరవించడమంటే అయ్యప్ప మాలతో దర్గాకు వెళ్లడం కాదని" కామెంట్ చేయగా, ఉపాసన ఈ అంశానికి తెలివైన సమాధానం ఇచ్చారు. శబరిమలకు వెళ్లే భక్తులు మసీదులో ప్రార్థనలు చేసే సంప్రదాయం గురించి టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రచురితమైన కథనాన్ని షేర్ చేసి, ప్రతి మతానికి సంబంధించిన సంప్రదాయాలను గౌరవించాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు. ఈ వివాదంపై ఉపాసన స్పందన సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. మత సామరస్యానికి, ఇతరుల విశ్వాసాలను గౌరవించేందుకు ఉపాసన ఇచ్చిన ఈ సందేశం అనేకమందిని ఆకర్షించింది. ఉపాసన చేసిన వ్యాఖ్యలు "మన దేశంలోని ఐక్యతకు స్ఫూర్తి చూపించేలా ఉన్నాయి," అంటూ నెటిజన్లు అభినందనలు తెలిపారు. ఇక రామ్ చరణ్ దర్గా సందర్శనను కొందరు ప్రశంసించగా, మరికొందరు దానికి వ్యతిరేకంగా స్పందించారు. కానీ ఈ చర్చలో చరణ్ తీసుకున్న నిర్ణయం సమాజంలోని మత సమగ్రతకు ఉదాహరణగా నిలుస్తోంది. ప్రతి మతం పట్ల గౌరవం చూపించడం ద్వారా మనం కలిసికట్టుగా ఎలా ఉంటామో చరణ్ చూపించినట్లుగా ఉందని అనేకమంది అభిప్రాయపడుతున్నారు. ఈ వివాదం చరణ్ అభిమానులలో కూడా హాట్ టాపిక్ గా మారింది, చరణ్ మత సామరస్యానికి చూపిన గౌరవం, ఉపాసన సమర్థన, ఈ అంశాన్ని సానుకూల దిశగా తీసుకెళ్లే అవకాశాన్ని అందిస్తున్నాయి. ఇక ప్రస్తుతం రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ విడుదలకు సిద్ధమవుతోంది. 2025 జనవరి 10న పాన్ ఇండియా రేంజ్ లో ఆ సినిమాను విడుదల చేయనున్నారు.

# నా మాట వినకపోతే... అంతే...!

## దళిత ఉపాధ్యాయురాలు పై వివక్షత

## రిటైర్డ్ తెలుగు టీచర్ లిల్లెమ్మ పై హెచ్‌ఎం కక్ష సాధింపు చర్యలు

- ఉద్దేశపూర్వకంగానే లిల్లెమ్మ రిటైర్మెంట్ ఫంక్షన్ జరగకుండా చేసిన పాఠశాల హెచ్ ఎం, ఇంచార్జ్ హెచ్‌ఎం లు
- రిటైర్మెంట్ ఫంక్షన్ ఉందని తెలిసి కూడా కావాలనే ఆప్షనల్ హాలిడే ప్రకటించిన హెచ్‌ఎం
- జరిగిన అవమానాన్ని తట్టుకోలేక కన్నీరు పెట్టిన లిల్లెమ్మ
- జి.కొండూరు జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వర్గ పోరు
- పాఠశాలలో హెచ్‌ఎం వింతపోకడలపై సర్వత్ర విమర్శలు
- ఉపాధ్యాయుల మధ్య కుల వివక్షతకు దారితీస్తున్న వైనం
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ ఉన్నత అధికారులు

**విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే విచక్షణ కోల్పోయి బుద్ధి తక్కువ పనులు చేస్తుంటే.......ఇంకా తమ పిల్లలకు ఏం చదువులు చెబుతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.మరోవైపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎక్కడ చూసినా ఉపాధ్యాయుల మధ్య వర్గ పోరు,కుల వివక్షత ఎక్కువైందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.ఉదాహరణకు ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలం, జి.కొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయు రాలు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు వల్ల ఒక దళిత రిటైర్డ్ తెలుగు ఉపాధ్యా యురాలి కి ఊహించని అవమానం ఎదు- రయ్యింది.ఆ పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు ఆమె పట్ల కఠినంగా వ్యవహరిస్తూ మానవత్వం మరచి రిటైర్మెంట్ ఫంక్షన్ కు సహకరించ కపోవడంతో ఆ తెలుగు ఉపాధ్యాయు రాలు మానసికంగా కృంగిపోవడంతో పాటు ఆర్థికంగా నష్టపోయింది.హెచ్‌ఎం మాట వినకపోతే......అంతే ఉంటుందని ఉపాధ్యాయులు చెప్పడం విశేషం.దీనిపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.....మరోవైపు రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయురాలు లిల్లెమ్మ తనకు జరిగిన అన్యాయం పై జి.కొండూ రు గ్రామంలో విలేకరుల ముందు తన ఆవేదన వ్యక్తం చేసింది.**


హెచ్‌ఎం తో రిటైర్మెంట్ ఫంక్షన్ గురించి సంప్రదిస్తున్న లిల్లెమ్మ (ఫైల్ ఫోటో)

**జి.కొండూరు,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత ను విధుల నుంచి వెంటనే సస్పెండ్ చేయా లని రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయరాలు ఎస్.లిల్లెమ్మ డిమాండ్ చేశారు. జి.కొండూరు గ్రామంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జి. కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎ తెలుగు టీచర్ గా పనిచేస్తూ 31 అక్టోబర్ 2024 తేదీన ఉద్యోగ విరమణ చేశానని, అంతకు ముందు రోజు అక్టోబర్ 30వ తేదీ నా రిటైర్మెంట్ ఫంక్షన్ ఉందని, దానికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నానని అయితే పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రిటైర్మెంట్ ఫంక్షన్ జరగకుండా చేయాలని ఉద్దేశపూర్వకంగా అక్టోబర్ 30వ తేదీన పాఠశాలకు ఆప్షనల్ సెలవు ప్రకటించారని లిల్లెమ్మ తెలిపారు.తాను 23 సంవత్సరాలు పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలో తెలుగు ఉపాధ్యాయురాలి గా పలు పాఠశాలలో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దానని తెలిపారు.అయితే జి. కొండూరు పాఠశాల హెచ్‌ఎం శ్రీలత తనకు వీడ్కోలు సభ నిర్వహించకుండా అగౌరపరిచి, అవమాన పరిచేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి కారణం తాను ఎస్సీ దళిత కులానికి చెందిన మహిళ ఉపాధ్యాయురాలు కావటమే ఆమెకు ప్రధాన కారణమన్నారు.తాను ఎన్నో ప్రజా సేవా కార్యక్రమాలు చేశానన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి తాను పనిచేసే చోట గౌరవ సూచికంగా సన్మానించి, వీడ్కోలు నిర్వహించటం ఆనవాయితీ అనీ,కానీ దీనికి భిన్నంగా స్థానిక హై స్కూల్ హెచ్‌ఎం తనకున్న కుల అహంకారంతో కక్షపూరితంగా తనను గౌరవించకుండ,మానసికంగా ఇబ్బందు లు పెట్టారన్నారు.పాఠశాలలో సహోద్యో గులను హెచ్‌ఎం ప్రతిరోజు మానసికంగా వేధిస్తున్నారని ఉపాధ్యాయురాలు లిల్లెమ్మ ఆరోపించారు. రిటైర్మెంట్ ఫంక్షన్ కు 20 రోజులు క్రితమే స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేయడం,పాఠశాల ఉపాధ్యాయులు కూడా రూ.350 లు చొప్పున రిటైర్మెంట్ ఫంక్షన్ కోసం కేటాయించడం జరిగిందని,అక్టోబర్ 31వ తేదీ దీపావళి పండుగ కావడంతో 30వ తేదీనే రిటైర్మెంట్ ఫంక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్ ఎం శ్రీలత నోటీసు పంపించడం జరిగిందన్నారు.తన వీడ్కో లు సభకు వ్యక్తిగతంగా అన్ని ఏర్పాట్లు చేసుకున్నానని,కానీ హెచ్‌ఎం తన అహంకార వ్యవహార శైలి వల్ల తన పరువు,ప్రతిష్ఠ లకు భంగం వాటిల్లిందని ఉపాధ్యాయురాలు లిల్లెమ్మ ఆవేదన వ్యక్తంచేశారు.ఆమె ప్రత్యేకంగా సెలవు దినం ఏర్పాటు చేసుకొని తిరుపతి వెళు తున్నానని అక్టోబర్ 30, 31వ తేదీ లలో ఉండటం లేదని చెప్పి 30వ తేదీన తనకు తెలియకుండానే హెచ్‌ఎం శ్రీలత పాఠశాలకు ఆప్షన్ హాలిడేగా ప్రకటించిం దని లిల్లెమ్మ తెలిపారు.హెచ్‌ఎం తనకు అనుకూలంగా ఉంటే సరి.లేదంటే ఎరాస్ చేస్తారని,తనకు అంటకాగే వారి తో ఏదైనా చెప్పి చేయించడం,లేదంటే కక్ష సాధింపు చర్యలు చేపట్టడం చేస్తార ని లిల్లెమ్మ ఆరోపించారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హెచ్‌ఎం శ్రీలత ను సస్పెండ్ చేయాలని కోరారు. ఇదిలా ఉంటే రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయురాలు రిటైర్మెంట్ ఫంక్షన్ చేయకపోవడాన్ని వ్యతిరేకస్తూ ఆ పాఠశాల ఉపాధ్యాయులు హెచ్‌ఎం శ్రీలత, ఇంచార్జ్ హెచ్‌ఎం లను తప్పు బడుతున్నారు.ముందుగా అనుకున్న దాని ప్రకారం రిటైర్మెంట్ ఫంక్షన్ జరిపిస్తే బాగుండేదని అంటున్నారు.

**హెచ్‌ఎం శ్రీలత వివరణ :**

ఈ విషయం పై జి.కొండూరు జడ్పీ ప్రధానోపాధ్యా యురాలు శ్రీలత ను వివరణ కోరగా... తాను 30వ తేదీన తిరుపతి వెళుతు న్నానని లిల్లెమ్మ రిటైర్మెంట్ ఫంక్షన్ భాద్యతలు పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం రమేష్ కు అప్పగించడం జరిగిందన్నారు.

**ఇంచార్జ్ హెచ్‌ఎం రమేష్ వివరణ :**

ఈ విషయంపై రమేష్ ను వివరణ కోరగా తనకు 30వ తేదీన పని ఉందని, ఏం సంగతి తర్వాత చెబుతానని, ఇన్చార్జి బాధ్యతలు తీసుకుంటున్నట్లు సంతకం కూడా పెట్టలేదని హెచ్‌ఎం శ్రీలత కు తెలియజేశానన్నారు అన్నారు. అయితే రమేష్ తనకేమి చెప్పలేదని హెచ్‌ఎం శ్రీలత వెల్లడించారు.


విలేకర్లతో మాట్లాడుతున్న తెలుగు ఉపాధ్యాయురాలు లిల్లెమ్మ

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు -ఎక్సైజ్ సిఐ జె. శ్రీనివాస్

- ఒక బెల్టు....ముగ్గురిపై బైండోవర్లు



**మైలవరం,నవంబర్ 21 (వార్తాప్రభ) :** బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ జె. శ్రీనివాస్ హెచ్చరించారు.ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలో గురువారం జరిపిన దాడులలో భాగంగా మైలవరం మండలంలోని కీర్తిరాయుని గూడెం గ్రామంలో కందుల శివన్నారాయ ణ అనే వ్యక్తి అనధికారికంగా మద్యం అమ్ముతుండగా అరెస్ట్ చేసి 8 షాట్ విస్కీ 180 ఎంఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.ముద్దాయి కందుల శివన్నారా యణ పై మైలవరం ఎక్సైజ్ స్టేషన్ లో కేసు నమోదు చేశామన్నారు.మరో ముగ్గురు పాత ముద్దాయిల ను మైలవరం తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.ఈ దాడుల్లో ఎస్ఐ దుర్గ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు!



**గిద్దలూరు,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ప్రకాశం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని కుమ్మరాం కట్ట సెంటర్ లో ప్రజల సౌకర్యార్థం ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. ప్రస్తుతం ఆ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారి ఉపయోగంలో లేకుండా పోయింది. గిద్దలూరు పట్టణానికి అవసరాల నిమిత్తం వచ్చినప్పుడు మరుగుదొడ్లు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. లక్షల రూపాయలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉపయోగంలో లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




**కంకిపాడు,నవంబర్ 21 (వార్తాప్రభ) :** న్యాయ వ్యవస్థలో మారుతున్న చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సిఐడి డి. ఎస్. పి కె శ్రీనివాస్ కుమార్ అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో రాష్ట్ర క్రైమ్ ఇన్విస్టిగేషన్ డిపార్ట్మెంట్ ఐపీఎస్ రవిశంకర్ అయ్యనార్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వినీత్ బ్రీజిలాల్ ఫ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వారి ఆదేశాలు ప్రకారం, విజయవాడ రీజినల్ ఆఫీస్ సిఐడి అధికారి డి ప్రసాద్ అడిషనల్ సూపరెంట్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో గొల్లగూడెం గ్రామంలో ఎస్సీ మరియు ఎస్.టి, పి.ఓ.ఏ చట్టం గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డి. ఎస్. పి కే శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకొని వారి సమస్యలు పై పోరాడాలన్నారు. నేరం జరిగినప్పుడు ఏ విధంగా రిపోర్ట్ చేయాలి, న్యాయ సేవలు ఎలా పొందాలి, ఎస్సీ మరియు ఎస్టీలపై అక్రమాలు జరిగినప్పుడు వాటి నిరోధానికి ఉన్న చట్టాలు, అక్రమాలకు పాల్పడే వారిపై తీసుకునే చర్యలు, ప్రభుత్వం నుంచి బాధితులకు అందే సహాయం, ఆర్థిక సాధికారత ఏ విధంగా సాధించాలి, ఎస్సీ మరియు ఎస్టీ, పిఓఏ చట్టం 1989 గూర్చి మరియు వాటి సవరణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి బాలాజీ రావు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిహెచ్ నరసింహారావు, డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం. ఫణి ధూర్జటి, సర్పంచ్ నత్త దుర్గ భవాని,ఎంపీడీవో బి అనూష, తహసిల్దార్ వి.భవనారాయణ, సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ, సిఐడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థినీ విద్యార్థులు హెల్త్ చెక్ అప్ చేయించుకోవాలి



**నూజివీడు,నవంబర్ 21 (వార్తాప్రభ) :** శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో హెల్త్ డిపార్ట్మెంట్ గొల్లపల్లి వారి ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమము నిర్వహించడమైనది. పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ విద్యార్థులు హెల్త్ చెక్ అప్ చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడుకోవాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్యముగా ఉండాలని కోరారు. విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యముగా ఉండినట్లయితే సమాజం బాగుపడుతుందని తెలిపా రు. ఎత్తు, బరువు, రక్త శాతం, తలకొలత ,ఛాతి కొలత, చేతి కొలత మరియు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించ డమైనది. 6 వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహి ంచడమైనది. డాక్టర్ శ్రీనివాస్ గౌతమ్ ఆధ్వర్యంలో మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్ మహిమ ,ఎ యన్ ఎమ్ ప్రిస్కిల్లా, ఆశావర్కర్లు కాసులు, దేవ కరుణ ,నాన్ టీచింగ్ సిబ్బంది నారాయణ పాల్గొన్నారు.

## శెట్టిబలిజ సోదరులారా.. కదలిరండి.. 24న కార్తీక వనసమారాధన



**అమలాపురం,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ఈనెల 24న శెట్టిబలిజ కార్తీక వన సమారాధన జరుగుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. స్థానిక కొంకాపల్లి లోని సత్తెమ్మ చెట్టు ఆలయం వద్ద అమలాపురం శెట్టిబలిజ సంఘీయుల పాత్రికేయుల సమావేశం గురువారం జరిగింది. ఈ వనసమారాధన పార్టీలకు అతీతంగా జరుగుతుందని, జిల్లాలోని శెట్టిబలిజ సంఘ పెద్దలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మంత్రి సుభాష్,రెడ్డి సుబ్రహ్మణ్యంతోపాటుగా మాజీ మంత్రులు, ఎంపిలు, అమలాపురం సంఘ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. గత సంవత్సరం జరిగిన వన సమారాధనకు అంతకు మించి అధిక సంఖ్యలో శెట్టిబలిజ సంఘీయులు, మహిళలు, యువకులు ఈ వన సమారాధనకు రానున్నారని, దీనికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, వాహనాల నిలుపుదలకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయడం జరిగిందని సత్యం తెలియజేశారు. వన సమారాధనకు సంబంధించి విచ్చేసే శెట్టిబలిజ సోదరులకు భోజనాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈ సందర్భంగా డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండే కాకుండా ఉభయ రాష్ట్రాల నుండి శెట్టిబలిజ నాయకులు, సోదరులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా యువకులు ఏ పార్టీ జెండాలు ఈ వనసమారాధనలో ప్రదర్శించకూడాదని, మోటార్ బైక్‌ల సైలెన్స్‌లు తీయడం వంటి పనులు చేయరాదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మామిశెట్టి శివరామ ప్రసాద్, చెల్లుబోయిన రాంబాబు, రాయుడు సత్యరుషి, గుత్తుల శ్రీనివాస్,బొంతు సత్తిబాబు, దొంగ శ్రీను,వాసంశెట్టి జగదీష్, అనిశెట్టి శ్రీనివాస్, రెడ్డి శివాజీ, చొల్లంగి వెంకటరమణ, దంగేటి శ్రీనివాసరావు, వాసంశెట్టి చినబాబు,దొంగ కుమార్‌లతోటుగా ఎస్ ఏ ఎఫ్ యువత పాల్గొన్నారు.

## నిర్మాణాత్మక కార్యక్రమాల్లో ఎంపీ బాలశౌరి ఎమ్మెల్యే కాగిత



**కృత్తివెన్ను,నవంబర్ 21 (వార్తాప్రభ) :** మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి మరియు పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కృత్తివెన్ను మండలంలో గురువారం పలు నిర్మాణాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్న గొల్లపాలెం గ్రామం నందు నలభై లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే కమ్యూనిటీ హాల్ నకు ఎంపీ బాలశౌరి మరియు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. తదనంతరం గరిశ పూడి గ్రామం నుంచి చందాల గ్రామం మీదుగా పడతడిక గ్రామం వరకూ నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి గాను శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఒడుగు తులసిరావు, మండల ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య, జనసేన మరియు బిజెపి ఇన్చార్జిలు పంచకర్ల సురేష్ పడవల కొండ, కూనసాని చిన్న, జడ్పిటిసి మైలా రత్నకుమారి అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ తిరుమల శెట్టి చంద్రమౌళి, జనసేన నాయకులు పాశం నాగమల్లేశ్వరరావు తిరుమాని రామాంజనేయులు పాశం కృష్ణ బిజెపి నాయకులు దాసరి శ్రీను ఇల్లూరి సుబ్బారావు తెలుగుదేశం నాయకులు బస్వాని బంగార్రాజు బొర్రా ఏడుకొండలు సూరగాని బ్రహ్మం కరీంశెట్టి చిన్నారి కూనసాని శ్రీనివాసరావు కూనసాని అశోక్ దాసరి బాల యేసు పాలపర్తి తాతాజీ నాగిడి చెన్నకేశవ n యాదం రెడ్డి కొండ కొప్పర్తి రంగారావు వాటాల నాగర్జున తిరుమాని పాండు సర్పంచులు నాగిడి నాగర్జున పెనుమాల సునీల్ మరియు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవ వేడుకలు

- ఉద్యోగ అవకాశాలు అందించే కోర్స్ బిఎస్సీ ఫిషరీస్

**- కె. కరుణాకరరావు జిల్లా మత్స్యశాఖ అధికారి**




**కాకినాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవం-2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవం జరిగింది.జ్యోతి ప్రజ్వలన,ప్రార్థన గీతంతో ప్రారంభమైన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫిషరీస్ కోర్సును విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు.మారుతున్న పరిస్థితులకు, సాంకేతికతకు అనుగుణంగా ప్రవేశపెడుతున్న కోర్సులలో అనేక అవకాశాలు ఉన్నాయని,ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అత్యాధునిక సదుపాయాలతో నిర్వహిస్తున్న ఫిషరీస్ డిపార్ట్మెంట్ విద్యార్థులు రాబోయే రోజులలో ఉత్తమ అవకాశాలను పొందుతారని అన్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు దీటుగా ఫిషరీస్ విద్యార్థులకు ప్లేస్మెంట్స్ తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా మత్స్యశాఖ అధికారి కె. కరుణాకరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రపంచ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆక్వా రంగంలో విద్యార్థులకు ఉన్న అవకాశాలను వివరించారు.స్థిరమైన ఫిషింగ్ పద్ధతులు, విధానాలను విద్యార్థులకు వివరించారు.సముద్ర పర్యావరణ వ్యవస్థల రక్షణ,ప్రపంచవ్యాప్తంగా మత్స్య సంపదపై ఆధారపడిన కోట్లాది మంది జీవనోపాధి వంటి విషయాలను వివరించారు. విద్యార్థులు చేపల పెంపకం ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుకొని,స్థిరమైన ఫిషింగ్ పద్ధతుల అమలు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.బీఎస్సీ ఫిషరీస్ కోర్సును ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆదిత్య యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.గౌరవ అతిథి కాకినాడ ఎస్ జి ఎస్ ఆక్వా సొల్యూషన్స్ తాళ్లూరి మధు చేపల పెంపకం,ఉత్పత్తి,పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు ముఖ్య అతిధుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఈ వేడుకలకు సీఎం ఎఫ్ ఆర్ ఐ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ కె.ధన రాజు ప్రత్యేక ఆహ్వానితులు విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఫిషరీస్ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జి మూర్తి,ఫిషరీస్ విభాగాధిపతి డాక్టర్ కే.నరసింహమూర్తి, అధ్యాపకులు ఎండి అలీ ఖాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



**కంకిపాడు,నవంబర్ 21 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడు గ్రంథాలయంలో గత వారం రోజులుగా విద్యార్థిని విద్యార్థులతో 57వ జాతీయ గ్రంథాలయ వారిచులను నిర్వహిస్తున్నారు చివర రోజు సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా ఆటల పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖన వివిధ రకం పోటీలలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ హెచ్ సి చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు, సెయింట్ మేరీస్ హై స్కూల్ ప్రిన్సిపాల్ చిత్ర, గ్రామస్తులు డ్రోన్ రాజా తంబా బత్తుల శేషుబాబు, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. డ్రోన్ రాజా వ్యవస్థలో డ్రోన్లు ఏ విధంగా ఉపయోగించాలి వాటి వల్ల కలిగే ప్రయోజనాలు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి సిహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లకు బానిసలు కావద్దు

**విద్యార్థులకు సూచించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్**



**పెడన,నవంబర్ 21 (వార్తాప్రభ) :** విద్యార్థులు సెల్ఫోన్లకు బానిసలు కావద్దని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి సూచించారు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆయన కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. ఆ సమయాన్ని పుస్తకాల మీద ఉంచితే విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవచ్చని అన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాల్మన్ రాజు మాట్లాడుతూ గ్రంథాలయాలలో పుస్తకాలు మాత్రమే లభిస్తాయి అనుకుంటే పొరపాటు అని అక్కడ జ్ఞానం విజ్ఞానం కూడా లభిస్తుందని తెలిపారు.సమాజ అభివృద్ధి లో గ్రంథాలయ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా గత వారం రోజులు పాటు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను ప్రశంసా పత్రాలను అందజేశారు. వారోత్సవాల విజయవంతంకు సహకరించిన సిబ్బందిని కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి కార్యదర్శి సుగుణా రెడ్డి అకడమిక్ డైరెక్టర్ నాయుడు వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ ఏ ఓ బాపూజీ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

# ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్రధానంగా ఉన్న మూడు సమస్యలను పరిష్కరించండి

- అసెంబ్లీలో సంబంధిత మంత్రి ని కోరిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**గన్నవరం, నవంబర్ 21 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజ కవర్గం లో ఇరిగేషన్ శాఖ కు సంబందించి ప్రధానంగా ఉన్న మూడు సమస్యలకు పరిష్కారం చూపాలని గన్నవరం నియోజక వర్గం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు . ఈ సందర్భంగా గురువారం ఆయన అసెంబ్లీ లో మాట్లాడుతూ 1276 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బ్రహ్మలి ంగయ్య చెరువు ను రిజర్వాయిర్ గా చేసేందుకు 2014-19 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వం నిధులు కేటాయించినా ..గత వైసిపి పాలనలో సోమ్ము ను డ్రా చేయటం తో పాటు అక్రమంగా మట్టి ని దోచేశారని విమర్శించారు . ఈ బ్రహ్మలింగయ్య చెరువును రిజర్వాయర్ గా మార్చి పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు . అలాగే పోలవరం – ఏలూరు కాలువల అనుసంధానం కోసం రూ.15.60 కోట్లు కేటాయించినా గత ప్రభుత్వం అలసత్వం వల్ల నిర్మాణం ఆలస్యం కాగా నిర్మాణ వ్యయం పెరిగిందని అన్నారు . తిరిగి అంచానా విలువ రూ.32 కోట్లకు పెరిగిందని అన్నారు . పోలవరం ఏలూరు కాలువ ను అనుసంధానం చేయాలని అలానే రామవరప్పాడు , ఎనికేపాడు , జక్కుల నెక్కలం ప్రాంతాల్లో ఏలూరు కాలువ పై పైవంతెనలను నిర్మాణం చేయాలని కోరారు . గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు ప్రహరి , రెయినింగ్ పాడయిపోయాయని వాటికి నిధులు కేటాయించాలని వెల్లడించారు.

# ఆద్విక్ పుట్టిన రోజు సందర్భంగా ఆశాజ్యోతి లో విందు భోజనం



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 21 (వార్తాప్రభ) :** ఒక్కొక్కరు ఒక్కో రకంగా పుట్టిన రోజును జరుపుకుంటారు. కాకులపాడు గ్రామానికి చెందిన చలసాని శ్రీనివాసరావు, పద్మ దంపతులు గత మూడు సంవత్సరాలుగా తమ పుట్టిన రోజులు, పెళ్లి రోజు లే కాకుండా తన కుటుంబ సభ్యుల పెళ్లి రోజు పుట్టిన రోజులు కూడా ఆశాజ్యోతి లోనే నిర్వహిస్తున్నారు. యు ఎస్ లో ఉన్న తన కుమారుడు కిషోర్, ఆశాలత దంపతుల కుమారుడు ఆద్విక్ 2 వ జన్మదినం గురువారం ఆశా జ్యోతి లో వికలాంగ బాలల మధ్య జరుపుకున్నారు. వికలాంగ బాలల కు స్వయంగా భోజనం వడ్డించారు. వీరి మధ్య తన మనుమడు పుట్టినరోజు జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా జ్యోతి ప్రెసిడెంట్ మరీదు వెంకట స్వామి, డైరెక్టర్ మాధవీ లత తదితరులు పాల్గొన్నారు.

# గరికపాటి జన్మదినం సందర్భంగా హనుమాన్ జంక్షన్ లో మేఘా కంటి వైద్య శిబిరం



**హనుమాన్ జంక్షన్, నవంబర్ 21 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గ జన సేన పార్టీ నాయకులు గరికపాటి శివ శంకర్ జన్మదినం పురస్కరించుకొని గురువారం హనుమాన్ జంక్షన్ విజయ-వాడ రోడ్ లో మనోహర్ హోటల్ దగ్గర మేఘ కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శంకర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిటూషన్స్ అండ్ రీసేర్చే సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని గరికపాటి శంకర్ , ఎం డి డాక్టర్ నాదెళ్ల విష్ణు వర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ఇప్పటి వరకు 4 ఉచిత కంటి వైద్య శిభిరాలు నిర్వహించి వందలాదిమందికి వైద్య సహాయం అందించామని చెప్పారు. పేదవారికి నియోజకవర్గ పరిధిలో సేవలందించాలనేది తన ఉద్దేశమన్నారు. రాజకీయ లబ్ది కోసం కాకుండా ఎన్నికల అనంతరం ఈ శిభిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ రోజు శిభిరం లో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 70 మందికి ఆపరేషన్స్ అవసరం కాగా వీరందరికీ 4 రోజుల్లో ఆపరేషన్లు చేయిస్తామన్నారు ఉచితంగా మందులు అందించారు.ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మెన్ చలసాని ఆంజనేయులు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన శివ శంకర్ ను అభినందించారు. కాగా శివశంకర్ జన్మదినం సందర్భంగా హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతి లో ఒక రోజుకు సరిపడ నిత్యావసర వస్తువుల అందజేశారు.ఈ కార్యక్రమంలో కరణం శ్రీనివాసరావు, గేదెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే గన్నవరం నియోజకవర్గం లో పలుచోట్ల శివశంకర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

# కమ్మిలి ఆధ్వర్యంలో ఎస్ ఎన్ పాలెంలో అయ్యప్ప భక్తులకు అన్నదానం



**హనుమాన్ జంక్షన్,నవంబర్ 21 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం శేరినరసన్నపాలెం గ్రామంలో పది సంవత్సరాలుగా అడపా యుగంధర్ గురు స్వామి, దేవులు బాబు గురు స్వామి ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహించబడుతున్న బిక్ష దానం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. 41 రోజులు దీక్ష చేసే స్వాములకి అన్నదానం చేస్తున్న అడపా బ్రదర్స్ కు తోడ్పాటు గా బుధవారం కృష్ణవరం వాస్తవ్యులు కమ్మిలి బ్రహ్మయ్య, సూర్య మెడికల్ అధినేత కమ్మిలి వీరవెంకట సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు శివ స్వాములకు భవానీలకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. . అడపా యుగంధర్ రావు మాట్లాడుతూ ఎంత అదృష్టం ఉంటే కానీ అయ్యప్ప మాలధారణ చేయలేము, అలా మాలధారణ చేస్తున్న స్వాములకు అన్నదానం చేయటం అనేది మా పూర్వ జన్మ సుకృతం అని అన్నారు, అడపా దేవులు బాబు గురుస్వామి మాట్లాడుతూ ఈ కార్యక్రమం అనేది దాతలు సహకారంతో గత పది సంవత్సరాల నుంచి జరుగుతుందని, ఈ అన్నదాన కార్యక్రమం సహకరిస్తున్న దాతలు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమానికి గన్నవరం నియోజకవర్గం జనసేన నాయకులు గరికపాటి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అయ్యప్ప పూజలు చేసి, సకల మాలదారులకు బిక్ష ను వడ్డించారు. ఈ సందర్భంగా గరికపాటి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల అనేది కఠినమైన కఠోర దీక్షిత తో కూడుకున్నదని 41 రోజులు మాలధారణ అయ్యప్ప నామస్మరణతో చేసి ఈ మాల ఎంత పవిత్రమైనదని, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రావటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు,దాతలు కమ్మిలి బ్రహ్మయ్య , కమ్మిలి సూర్యనారాయణ మూర్తి కి అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులు ఇవ్వాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలోఅడపా యుగంధర్ రావు గురుస్వామి, అడపా దేవులు బాబు గురుస్వామి,గాంధీ గురుస్వామి, పుషడుపు రామకృష్ణ,అడపా సతీష్ గురుస్వామి,కంపసాటి కొండలరావుగురుస్వామి, ముప్పా గిరి, కొలుసు ఇంద్ర ప్రసాద్,వి. జ్ఞానేశ్వర్, చోడిశెట్టి కృష్ణ, పోకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా జ్యోతి లో మేఘా మెడికల్ క్యాంప్



**హనుమాన్ జంక్షన్, నవంబర్ 21 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లోని ఆశాజ్యోతి లో గురువారం మేఘా. వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆశాజ్యోతి తో పాటు ఏలూరు ఆశ్రం హాస్పిటల్ వారు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. ఈ శిభిరాన్ని ఏలూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ కె రత్న ప్రసాద్ ప్రారంభించారు. వివిధ విభాగాల్లో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సి జి తో పాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె పద్మావతి, ఆశాజ్యోతి . డైరెక్టర్ లయన్ మాధవీ లత, ఆశ్రం హాస్పిటల్ సి ఇ ఓ డాక్టర్ కె హనుమంతరావు , ఆశా జ్యోతి ప్రెసిడెంట్ మరీదు వెంకటస్వామి , పెదపాడు మండల సి డి పి ఓ సునీల్ రాజశేఖర్, అంగన్వాడి టీచర్స్, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయ వారోత్సవాల్లో విద్యాలయ విద్యార్థుల ప్రతిభ



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** గత వారం రోజులుగా నిర్వహిస్తున్న షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యాలయ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబరిచి.. విజయవాడ ఎయిర్పోర్ట్ అథారిటీ మెంబర్ కె. తులసి బాబు, మండల విద్యాశాఖ అధికారి కె. బాలాజీ, గ్రంథాలయ అధికారి బీరం శ్రీనివాస రావు చేతుల మీదుగా బహుమతులు స్వీకరించారు. మొదట స్కిట్ విభాగంలో ఏడవ తరగతి విద్యార్థులు మూడెడ్ల పూర్ణ శ్రీ పునీత్, అడపా నితిన్, చెన్ను అభినవ్ ,పసుపులేటి నితీష్ ప్రథమ స్థాయిలో విచిత్ర వేషధారణ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని మన్యం సాయి అక్షర ప్రథమ స్థాయి వకృత్వ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి అన్నం పార్థు ద్వితీయ స్థాయి ఈడే పునీత్ తృతీయ స్థాయి చిత్రలేఖన విభాగంలో మూడెడ్ల పూర్ణ శ్రీ పునీత్ ద్వితీయ స్థాయి వ్యాసరచన పోటీలలో మట్లపూడి సిరి తేజ స్వి తృతీయ స్థాయి స్కిట్ సీనియర్ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థునులు తుమ్మలచెర్ల దామిని శ్రీజ, కోరుపల్లి రూప్ రిషిత, మన్యం సాయి అక్షర ,పోలుబోయిన శ్రావణి, భత్తుల హాసిని ప్రియ, మజ్జి జోషికామని ద్వితీయ స్థానం పొందారు. బహుమతులు పొందిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, శాంతి.. లు అభినందించారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాల లో ముగిసిన గ్రంధాలయ వారోత్సవాలు..



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి, గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్. ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రబాబు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో చదువుతో పాటు, సమాజం పట్ల అవగాహన పెంచుకుంటూ, మహిళలను ఎలా గౌరవించాలి.. అలాగే తల్లిదండ్రుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రతి విద్యార్థి తనను తాను ఉన్నతంగా ఎలా తీర్చుదిద్దుకోవాలో తెలియచేయడం జరిగింది. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆలీయాబేగం, కామర్స్ హెచ్ఓడి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి జి. రాణి, జి. జీవన్, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్‌కు అభినందనలు



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని మాల కార్పోరేషన్ కార్యాలయం లో బుధవారం ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పెదపూడి విజయ్ కుమార్ గారిని గుడివాడ నియోజకవర్గం జనసేన పార్టీ తరఫున నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర, ఉపాధ్యక్షుడు బట్టు రవికిరణ్, చలమలశెట్టి విఠల్, సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంలో ఉన్న తృప్తి.. నెట్ సెర్చింగ్‌లో ఉండదు..

- ఏఎన్నార్ కళాశాలలో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు..
- పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు..



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల ముగింపు సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కాట్రగడ్డ సింహాద్రి అప్పారావు మాట్లాడుతూ విజ్ఞానం నేర్చుకొని వ్యవస్థను మంచి మార్గంలో పెట్టడానికి పుస్తక పఠనానికి ఎక్కువ సమయం కేటాయించాలని, అందుకు గ్రంథాలయాలని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ డా॥ పి.జె.ఎస్. కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీ కి అనుగుణంగా పాఠకులకు అందుబాటులో ఉన్న గ్రంథాలయాలే కాకుండా, నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీలలో సమాచారాన్ని సేకరించి విద్యార్థులు మరింత ముందడుగు వేయడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయ అధికారిణి బి.ఎస్.ఎస్. పద్మజ మాట్లాడుతూ ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తరువాత అన్ని విషయాలూ నెట్ లో సెర్చ్ చేస్తే సులభముగా దొరుకుతుంది అన్నారు. కానీ పుస్తక పఠనంలో ఉన్న తృప్తి నెట్ సెర్చింగ్లో లేదు అన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో ప్రథమ బహుమతి ఎం. మహాలక్ష్మి, కె. సిప్పోర, ద్వితీయ బహుమతి ఎం.డి. నిదాహున్నిస, టి. ఎన్.వి. సాహిత్య మరియు తృతీయ బహుమతి కె. చందు శ్రీకర్, ఎల్. హారిక, సి. హెచ్. గాయత్రిలు సాధించారు. విజేతలకు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కాట్రగడ్డ సింహాద్రి అప్పారావు బహుమతులు అందచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఎల్. రామకృష్ణ ప్రసాద్, గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, మనోజ, జ్యోతి, రమేష్, కుమార్, అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**మైలవరం,నవంబర్ 21 (వార్తాప్రభ) :** స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం ఆవరణలో 22అక్టోబర్ 2024వ తేదీ శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడివో పి. అనురాధ గురువారం ప్రకటనలో తెలిపారు.ఉపాధి హామీ పథకములో భాగంగా మైలవరం మండలంలోని 14 గ్రామపంచాయతీల లో 01.04.2023 నుంచి 31.03.2024 వరకు జరిగిన పనులపై గ్రామ పంచాయి తీల వారీగా సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై 22వ తేదీ ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక ప్రారంభమవుతుం దని ఆమె తెలియజేశారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సెర్ప్, హౌసింగ్, వెటర్నరీ, యస్.యస్.ఎ. పంచాయితీ రాజ్ పథకములపై సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజా వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# వారోత్సవాల విజయవంతంపై గ్రంధాలయ అధికారి బీరం హర్షం..

**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయాల వారోత్సవాల విజయవంతంపై గ్రేడ్ 1 గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ హర్షం వెలిబుచ్చారు. గురువారం ఉదయం బీరం మాట్లాడుతూ వారోత్సవాల విజయవంతానికి సహకరించిన పట్టణంలోని వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు గ్రంథాలయంలో జరిగిన ప్రతి కార్యక్రమానికి పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. ముఖ్యంగా తెలుగుభాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా అహోరాత్రులు కార్యక్రమాల విజయవంతానికి కృషిచేసిన సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన..

- 11వ వార్డులో ఒక్కరోజే సుమారు 200 మంది కార్యకర్తలుగా పార్టీ సభ్యత్వం..



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోంది. టీడీపీ నాయకులు స్పెషల్ డ్రైవ్‌ను గురు వారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశాల మేరకు టీడీపీ 11వ వార్డు ఇంఛా ర్జ్ షేక్ మౌలాలీ సారధ్యంలో ప్రత్యేకంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక్కరోజే వార్డుకు చెందిన సుమారు 200 మంది కార్యకర్తలుగా పార్టీ సభ్యత్వాన్నీ స్వీకరించారు. టీడీపీ మెంబర్ షిప్ తీసుకోవడం సమాజంలో ఒక గౌరవం, గుర్తింపుగా మారిందన్నారు. ముఖ్యంగా సభ్యత్వం తీసుకున్న కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుందని.. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. 5లక్షల భీమా అందిస్తుందని మౌలాలీ అవగాహన కల్పించారు. నవభారత్ ఖాదీ స్టోర్స్ ప్రొప్రైటర్ సయ్యద్ గఫార్ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్ళి.. ముఖ్యంగా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 11 వార్డు పార్టీ ఇంఛార్జి షేక్ కరిముల్లా, పార్టీ నాయకులు పట్టపు చిన్నా, సయ్యద్ గఫార్, షేక్ రఫీ, అబ్దుల్ నహీం, ఎండి అబ్దుల్లా భాషా తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయ వారోత్సవాల్లో విశ్వభారతి విద్యార్థుల ప్రభంజనం..



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయం, గుడివాడ లో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో విచిత్ర వేషధారణ, చెస్, క్యారమ్స్, వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్, దేశభక్తి గేయాలు, మ్యూజికల్ ఛైర్స్ మొదలైనవి. ఈ పోటీలలో విశ్వభారతి పాఠశాల విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాలలో 27 మంది విద్యార్థినీ, విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకోవడం జరిగింది. ఈ క్రమంలో పోటీలలో గెలుపొందిన విద్యార్థులను విశ్వభారతి పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ గురువారం అభినందించారు.

# బొమ్ములూరు (గుడివాడ) గ్రామంలో గృహ నిర్మాణ పనుల పరిశీలన..



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులంతా ఇళ్లు త్వరగా పూర్తి చేయాలనీ హౌసింగ్ డీఈ గుమ్మడి రత్నశ్రీ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన -గ్రామీణ పథకం కార్యక్రమంలో భాగంగా ఆవాస్ దివాస్ వారోత్సవములను పురస్కరించుకుని బొమ్ములూరు గ్రామం లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను డీ.ఈ. పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొమ్ములూరు గ్రామంలో 74 మంది గృహాలు నిర్మించుకుంటున్నారని, వారు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలనీ కోరారు. ఈ క్రమంలో ప్రతీ ఇంటికి వెళ్లి పనులు ఏ విధంగా జరుగుతున్నవి.. వారికి ఏయే మెటీరియల్ కావాలో మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వస్తున్న మెటీరియల్ త్వరగా అందిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఇ.ఇ. రామోజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల వసూలు వేగవంతం చేయండి - అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు



**గుడివాడ,నవంబర్ 21 (వార్తాప్రభ) :** పన్నుల వసూలు వేగవంతం చేయాలనీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులతో మున్సిపల్ కమీషనర్ బి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను బాధ్యతగా చేపట్టాలనీ, అలాగే కొత్త అసెస్మెంట్‌లపైన దృష్టి సారించాలన్నారు. పట్టణంలో ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

**హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే కు ప్రజలు సహకరించాలి :** హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే కోసం గుడివాడ పురపాలక సంఘం పరిధిలోని ప్రతి ఇంటి వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు పట్టణ ప్రజలందరూ సహకరించాలనీ కమీషనర్ శ్రీనివాసరావు కోరారు. హౌస్ హోల్డ్‌ని జియో ట్యాగ్ చేయడం ద్వారా సంబంధింత వార్డు సచివాలయ కార్యదర్శి కి సదరు నివాసము మ్యాపింగ్ అగునని, దాని ద్వారా సచివాలయ పరిధిలో నివాసములు, జనాభా వివరములు సమగ్రంగా ఉండుటకు వీలు కలుగుతుందన్నారు. కావున హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే కోసం పట్టణ ప్రజలు సహకరించాలనీ కోరారు.


IN THE COURT OF
THE II ADDL. CIVIL JUDGE
(SENIOR DIVISION),
VIJAYAWADA
I.A. No. 542/2019
IN
O.S. No. 594/2016

BETWEEN :-
Vallabhaneni Rupa And Another
... Petitioners/Plaintiffs
And
Chekka Dhanalakshmi And Others
... Respondents/Defendants

To,
R-09 : Chekka Naga Lakshmi, W/o. Late Narasimha Rao,
R-10 : Chekka Prudhvi Raj, S/o. Late Narasimha Rao,
R-11 : Chekka Malleswari, D/o. Late Narasimha Rao,
R-9 - 11 are Residents of Door No. 41-2/4-14, Metla Bazar, Krishna Lanka, Vijayawada-520013, Krishna District.

Please take notice that the Petitioners filed the above Petition against You and the Hon'ble Court was pleased to issue notice under substitute service to No. 9 to 11 of you for your appearance and the matter is posted to 29-11-2024 for your appearance.

Therefore, you are hereby required to appear before the Hon'ble Court on 29-11-2024 at 10-30 A.M., in-person or through Counsel, otherwise the matter will be heard and decide in your absence.

(By Order of the Hon'ble Court, Dated 25-10-2024)

Katragadda Kishore Kumar
N. Lekhya Sri
Advocates
# 27-17-5, Peddibotla Vari Street,
Vijayawada-520002
Cell : 94404 88409/92464 58409
20-11-2024



IN THE COURT OF
THE II ADDL. CIVIL JUDGE
(SENIOR DIVISION),
VIJAYAWADA
I.A. No. 541/2019
IN
O.S. No. 594/2016

BETWEEN :-
Vallabhaneni Rupa And Another
... Petitioners/Plaintiffs
And
Chekka Dhanalakshmi And Others
... Respondents/Defendants

To,
R-09 : Chekka Naga Lakshmi, W/o. Late Narasimha Rao,
R-10 : Chekka Prudhvi Raj, S/o. Late Narasimha Rao,
R-11 : Chekka Malleswari, D/o. Late Narasimha Rao,
R-9 - 11 are Residents of Door No. 41-2/4-14, Metla Bazar, Krishna Lanka, Vijayawada-520013, Krishna District.

Please take notice that the Petitioners filed the above Petition against You and the Hon'ble Court was pleased to issue notice under substitute service to No. 9 to 11 of you for your appearance and the matter is posted to 29-11-2024 for your appearance.

Therefore, you are hereby required to appear before the Hon'ble Court on 29-11-2024 at 10-30 A.M., in-person or through Counsel, otherwise the matter will be heard and decide in your absence.

(By Order of the Hon'ble Court, Dated 25-10-2024)

Katragadda Kishore Kumar
N. Lekhya Sri
Advocates
# 27-17-5, Peddibotla Vari Street,
Vijayawada-520002
Cell : 94404 88409/92464 58409
20-11-2024



## సర్టిఫికెట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా వీర్లుపాడు మండల పరిధిలో గల జుజ్జూరు గ్రామానికి చెందిన పాటిబండ శ్రీనివాస్ కుమార్ అను నేను కంచికచర్ల నుంచి నా ద్విచక్ర వాహనంపై నా స్వగ్రామమైన జుజ్జూరు గ్రామం వెళుచుండగా మార్గ మధ్యలో నా బండి పైనుంచి సర్టిఫికెట్లు బ్యాగు జారిపోయినది. ఎంత వెతికినను కనిపించట్లేదు. ఆ బ్యాగు నందు నా డీ ఫార్మసీ సర్టిఫికెట్ ఒరిజినల్ ఉన్నది. కావున ఈ సర్టిఫికెట్ బ్యాగు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ తో పాటు ఫోన్ నెంబర్లను సంప్రదించ గలరని కోరుతున్నాము.

ఇట్లు
పాటిబండ శ్రీనివాస్ కుమార్
జుజ్జూరు గ్రామం,
వీరులపాడు మండలం,
ఎన్టీఆర్ జిల్లా. సంప్రదించవలసిన
నా యొక్క ఫోన్ నెంబర్లు :
9052142456


Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188